Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 15.08.2014, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 11 పేజీలు : 12, వెల : ₹ 5




లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com






## ముదురుతున్న వైరం...
# పెరుగుతున్న దూరం



**రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించడం కష్టం. 'అనుకున్నామని జరగవు అన్నీ - అనుకోలేదని ఆగవు కొన్ని' అనే పాటలోని మర్మం రాజకీయాలలో కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. రాజకీయమంటేనే పెద్ద మాయ. దీంట్లో నిత్యం పోరాటమే. బయట శత్రువులతోనే కాదు, ఇంట్లో శత్రువులతో కూడా ఎప్పుడూ యుద్ధమే.**

నెల్లూరుజిల్లా తెలుగుదేశం పార్టీలో విచిత్ర పోకడల మధ్య వర్గరాజకీయాలు జోరందుకుంటున్నాయి. తెలుగుదేశంపార్టీ పదేళ్ల పాటు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ పరంగా ఎటువంటి పాత్ర లేని పి.నారాయణ, ఇప్పుడు పార్టీ అధికారంలోకి వచ్చాక మున్సిపల్ మంత్రిగా రాష్ట్ర కేబినెట్‌లో సీఎం చంద్రబాబు తర్వాత రెండోస్థానంలో వుంటే, అధికారంలో వున్నా, ప్రతిపక్షంలో వున్నా పార్టీ మారకుండా, పార్టీ కోసం ఆర్థికంగా ఎదురుదెబ్బలు తిన్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి పార్టీ అధికారంలోకి వచ్చాక కూడా జిల్లా పార్టీలో ప్రాధాన్యత లేకపోవడం పార్టీలో కొత్త పరిణామాలకు దారి తీస్తుంది.

జిల్లాలో మంత్రి పి.నారాయణ, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిల మధ్య హాట్‌హాట్‌గా రాజకీయాలు నడుస్తున్నాయి. మంత్రి పి.నారాయణ స్వతహాగా రాజకీయ నాయకుడు కాదు. విద్యావేత్త. ఆయనకు జిల్లా రాజకీయాలతో పని కూడా లేదు. జిల్లాలో వర్గరాజకీయాల కంపు ఆయనకు అవసరం లేదు. తన శాఖకు సంబంధించిన పరిపాలనను చూసుకుంటూ రాజకీయాలు, వర్గాలకతీతంగా జిల్లాలో నాలుగు మంచిపనులు చేస్తే ఆయనకు మంచి పేరొస్తుంది. కాని ఆయనకు తెలిసో, లేక తెలియకుండానో జిల్లాలో మంత్రి వర్గం అంటూ ఒకటి ఏర్పడింది. ఈ మంత్రివర్గం లక్ష్యం జిల్లా రాజకీయాలలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రాధాన్యతను తగ్గించడం. ప్రభుత్వ కార్యకలాపాలలో ఆయన ముద్ర లేకుండా చేయడం. సోమిరెడ్డి సిఫారసుతో ఏ పనీ జరగకూడదు, ఆయన ఫోన్‌కాల్‌తో ఏ అధికారీ పని చేయకూడదు, జిల్లాలో అధికారికంగా ఏది జరిగినా మంత్రి నారాయణ ఆదేశాలతో, లేదా ఆయన ముఖ్యఅనుచరులతో ఆదేశాలతో జరగాలి అన్న వాతావరణాన్ని ఈ వర్గం సృష్టించింది. పార్టీలో సోమిరెడ్డిని తొక్కేయాలని, ఇక పార్టీకి ఆయన అవసరం లేదని చంద్రబాబే చెప్పాడని ఈ వర్గం ప్రచారం చేస్తోంది. ఒకరిద్దరైతే ఓ అడుగుముందుకేసి పార్టీ నాయకులకు ఫోన్‌లు చేసి మీరు సోమిరెడ్డి వైపు (మిగతా 10వ పేజీలో)



## కమలం వైపు...
# సీనియర్‌ల చూపు

**రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్ర రాజకీయాలలో గందరగోళం నెలకొంది. విభజన మూలంగా కొంతమంది నాయకులకు కొత్తగా రాజకీయ జీవితం లభిస్తే, చాలామంది సీనియర్ నాయకుల జీవితాలలో శూన్యత నెలకొంది. దీని నుండి ఎలా బయటపడాలో తెలియని స్థితిలో ఈ నాయకులున్నారు.**

రాష్ట్ర విభజన మూలంగా దారుణంగా దెబ్బతింది కాంగ్రెస్ నాయకులే. ముందుచూపు వున్న నాయకులు ఎన్నికలకు ముందే తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలలోకి వెళ్లిపోయారు. ఆ పార్టీలలోకి వెళ్లి చంద్రబాబు, జగన్‌ల క్రింద ఊడిగం చేయలేని సీనియర్ నాయకులు మాత్రం కాంగ్రెస్‌లోనే మిగిలిపోయారు. బావిలోని కప్పకు చెరువులోకి పోతే ఆనందంగా ఉంటుంది. అదే చెరువులోని కప్పలు బావిలోకి పోతే ఇరుకుగా ఉంటుంది. జాతీయ పార్టీల నుండి ప్రాంతీయ పార్టీలలోకి దూరిన నాయకుల పరిస్థితులు కూడా ఇలాగే ఉంటాయి.

కాంగ్రెస్ జాతీయపార్టీ. కాకపోతే ఆంధ్రప్రదేశ్‌లో ఆ పార్టీకి భవిష్యత్ లేదు. ఈ పార్టీలో మిగిలివున్న సీనియర్ నాయకులు తెదేపా, వైకాపాలలోకి పోలేరు. వారికి మిగిలివున్న ప్రత్యామ్నాయం భారతీయ జనతాపార్టీ. కాబట్టి బీజేపీలో చేరడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ రాష్ట్రంలో బలపడాలనేది బీజేపీ వ్యూహం. అందుకే సీనియర్ నేతలతో ఆ పార్టీ వర్గాలు మంతనాలు జరుపుతున్నాయి. మాజీసీఎం ఎన్.కిరణ్ కుమార్‌రెడ్డితో పాటు రాష్ట్రంలో పేరుమోసిన సీనియర్ నేతలు త్వరలోనే కమలంవైపు క్యూకడతారని సమాచారం.



## వేటు పడుతుందా..?
# పదవి నిలుస్తుందా?

**వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ టిక్కెట్ మీద పోటీ చేసి, మైనార్టీ కార్డును వాడుకుని జగన్ కమ్ ఫ్యాన్ ప్రభంజనంలో గెలిచి నెల్లూరు నగర పాలక సంస్థకు మూడో మేయర్ అయ్యే అదృష్టం దక్కించుకున్న షేక్ అబ్దుల్ అజీజ్ కార్పొరేషన్ కౌన్సిల్‌లో ఒక్క సమావేశం కూడా జరగకముందే తెలుగుదేశంపార్టీలోకి జంప్ కావడాన్ని వైయస్సార్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు.**

ఈ పరిణామాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా స్వాగతించడం లేదు. అజీజ్ లాంటి వాళ్లు అప్పటికప్పుడు పార్టీలు మారిస్తే పార్టీలో తమ పరిస్థితి ముందొచ్చిన చెవుల కంటే వెనకొచ్చిన కొమ్ములు వాడి అన్నట్లుగా తయారవుతుందని తెలుగుదేశం కార్యకర్తల ఆవేదన.

ఇక తమకు నమ్మకద్రోహం చేసి తెలుగుదేశంలోకి ఉడాయించిన అజీజ్‌పైన వైకాపా నాయకులు రగిలిపోతున్నారు. ముఖ్యంగా అజీజ్ వ్యవహారం నెల్లూరు నగర, రూరల్ ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్ యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిలకు ప్రతిష్టాత్మకంగా మారింది. అజీజ్‌ను పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం క్రింద పదవీచ్యుతుడిని చేయాలని, తద్వారా తమను నమ్మించి దొంగదెబ్బ తీసిన అజీజ్‌పై దెబ్బకొట్టాలనుకుంటున్నారు. అనిల్, కోటంరెడ్డిలకు ఇష్టం లేకపోయినా ముస్లింలకు జగన్ ఇచ్చిన అవకాశాన్ని కాదనకూడదనే ఉద్దేశ్యంతో ఈ ఎమ్మెల్యేలిద్దరూ మేయర్ ఎన్నిక కోసం పట్టుబట్టి పని చేసారు. ఈరోజు అజీజ్‌తో పాటు (మిగతా 10వ పేజీలో)

## ఓ సామాన్యుడి...
# అసామాన్య నిర్ణయం

**రాజకీయాల్లో వుంటే అనుకున్న పనులన్నీ చేసేసుకోవచ్చునీ, ఇక డబ్బు సంపాదనకు ఎలాంటి ఢోకా వుండదని అనుకునేవారే అధికం. ఏ చిన్నపనికైనా డబ్బు గుంజేవారు కోకొల్లలు. కేవలం సంపాదన కోసమే రాజకీయాల్లోకి వచ్చేవారూ, డబ్బుకు కక్కుర్తిపడి రాజకీయాల్లో అనునిత్యం స్వార్ధంతోనే వ్యవహరించేవారికీ ఇప్పుడు కొదవలేదు. అయితే అలాంటి వారందరికంటే భిన్నమైన మనస్సుతో రాజకీయాల్లోకి వచ్చి, ఎంతో కష్టపడి శాసనసభ్యునిగా నిలచి, గెలిచిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన సేవాభావంతో అందరిచేతా శభాష్ అనిపించుకుంటున్నారు.**

ప్రజలందరి ఆశీస్సులతో రాజకీయ రంగంలో ఆదర్శవంతంగా..మార్గదర్శకంగా రాణిస్తున్నారు. రాజకీయాలంటే ధన సంపాదనకు మార్గం కాదని, ప్రజాసేవా మార్గమని భావిస్తూ, ప్రజలిచ్చిన దీవెనలతో తాను శాసనసభ్యునిగా ఎన్నికయ్యాను కనుక, తనకు వచ్చే జీతభత్యాల డబ్బునంతా తనను ఎమ్మెల్యేగా గెలిపించిన గ్రామీణ నియోజకవర్గ ప్రజల అవసరాలకే వినియోగిస్తానని ప్రకటించి తన ఔన్నత్యాన్ని చాటుకున్నారు. తమ వద్ద కోట్లు మూలుగుతున్నా ఇంకా చాలక అక్రమార్జనలకు తెగబడేవారు ఎందరో వున్న నేటి కాలంలో..తనకు వచ్చే జీతభత్యాల డబ్బును కూడా తనను ఆదరించి (మిగతా 10వ పేజీలో)

## రూ.60లక్షల జీతం ప్రజలకే...

# HAPPY INDEPENDENCE DAY



KPCT
KRISHNAPATNAM PORT
India's Largest Container Terminal on the Horizon

# KPCT

The Preferred Destination for Container Trade on the East Coast of India



24x7 all weather Container Terminal with no tidal restrictions | Current capacity of 1.2 million TEUs | Excellent road and rail connectivity to the hinterland | Dedicated rail connectivity to the container yard | Strategic tie-up with MLOs, Feeders, Freight Forwarders, CHAs, LSP's, Transporters, CTOs and ICDs | Main liners – Maersk, MSC and three feeder services – BTL, Xpress Feeder and Far Shipping regularly call at KPCT | KPCT offers logistical advantage, faster turnaround times and competitive tariffs

**A Truly World Class Experience.**

KRISHNAPATNAM PORT
India's Largest Port on the Horizon

An ISO 9001, ISO 14001, OHSAS 18001 and ISO 28000 Certified Port
24x7 Customer Service Hotline Number: +91 80081 53789

www.krishnapatnamport.com

# ఎమ్మెల్యేలు ఎక్కడున్నా ఒకటే!

రాజకీయ నాయకులకు అధికారం, ఆక్సిజన్ ఒకటే అన్నట్లుగా మారుతోంది. ఆక్సిజన్ లేకుండా ఒక నిముషమైనా బ్రతకొచ్చేమోగాని అధికారం లేకుండా అరనిముషం కూడా ఉండేటట్లు లేరు. అధికారపార్టీలో ఉంటేనే పనులు జరుగుతాయనే(సొంత పనులు) నమ్మకం ఎక్కువ కావడంతో జంపింగ్ సంస్కృతి పెరిగిపోతుంది.

గత ఎన్నికలకు ముందు రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తుందనే నమ్మకం విపరీతంగా ఉండింది. ఈ నమ్మకంతోనే చెత్తాచెదారం వంటి సరుకంతా వైకాపాలో చేరిపోయింది. ఎమ్మెల్యే స్థాయికి తగని నాయకులకు కూడా వైయస్సార్ కాంగ్రెస్ నుండి ఎంపీ, ఎమ్మెల్యే టిక్కెట్లు వచ్చాయి. ఎన్నికలు జరిగాయి. పార్టీ అధికారం లోకి రాలేదు. వైకాపా అధికారంలోకి వస్తుందనే నమ్మకంతో ఎవరైతే ఆ పార్టీలో చేరారో ఇప్పుడు వారంతా తెలుగుదేశంలోకి పోవాలని చూస్తున్నారు. ఇప్పటికే కొందరు పోయారు కూడా!

ఈ వరుసలో మన జిల్లా నుండి కూడా ఇద్దరు ముగ్గురు ఎమ్మెల్యేల పేర్లు వినిపిస్తున్నాయి. ఫలితాలు విడుదలైన పక్కరోజు నుండే వీరి పేర్లు ప్రచారంలో ఉండడం విశేషం. వారి పేర్లు అప్రస్తుతం. అయితే ఇప్పుడు పార్టీ మారిన దానివల్ల తెలుగుదేశంకు ఒరిగేదేమీలేదు. వైకాపాకు కొత్తగా తరిగేదేమీలేదు. తెలుగుదేశంకు సంపూర్ణ మెజార్టీ వుంది. కొత్తగా ఎమ్మెల్యేలు అవసరం లేదు. ఈ ఐదేళ్లలో ప్రభుత్వం పడిపోతుందనే అనుమానం కూడా లేదు. అలాంటి పరిస్థితే వస్తే వైకాపా మొత్తం ఎమ్మెల్యేలు తెలుగుదేశంలో చేరినా పడిపోయే ప్రభుత్వాన్ని నిలబెట్టే పరిస్థితి వుండదు.

ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీలలో లభించే విలువ, గౌరవం తెదేపా, వైకాపా వంటి ప్రాంతీయపార్టీల్లో ఉండవు. ఇప్పుడు అధికారపార్టీ ఎమ్మెల్యేలమని తెలుగుదేశం వాళ్లు చంకలు గుద్దుకోవాల్సిన పనిలేదు. ప్రతిపక్షంలో ఉన్నామని వైకాపా ఎమ్మెల్యేలు బాధపడాల్సిన అవసరం లేదు. రాష్ట్ర పరిస్థితులే ఆ విధంగా తగలబడి ఉన్నాయి మరి. అధికారపార్టీలో వున్న ఎమ్మెల్యేలు చించేదేమీ లేదు. అధికారంలో లేక పోయినంత మాత్రాన వీళ్లు కోల్పోయేదేమీ లేదు. ఎవరికైనా పనులు ఒకటే విధంగా జరుగుతున్నాయి. వైకాపా ఎమ్మెల్యేలు ఇప్పుడేమాత్రం తొందరపడి తెదేపాలో చేరినా... జంపింగ్ జిలాని అని చెడ్డపేరు తెచ్చుకోవడం తప్పితే రాజకీయంగా ఎటువంటి ప్రయోజనం ఉండదు.

# తప్పటడుగా? తప్పుడడుగా??



***రాజకీయాలలో నేర్పుతో పాటూ ఓర్పు కూడా ముఖ్యం. ఈరోజుతో పాటు రేపు అనేది కూడా ముఖ్యమే! ఆ నేర్పుతో పాటు ఓర్పు కూడా ఉండబట్టే జనంలో బలం లేకపోయినా స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కాంగ్రెస్‌లో వుండి ముఖ్యమంత్రి కాగలిగాడు. రాజకీయాలలో ఈరోజు అన్నదానినే కాదు, రేపు ఏంటి అన్న దూరదృష్టి ఉండబట్టే ఉత్తరాది పార్టీ అని ప్రచారంలో వున్న బీజేపీని కనిపెట్టుకుని యం.వెంకయ్యనాయుడు రెండుసార్లు కేంద్రమంత్రి అయ్యాడు. ఒకసారి ఆ పార్టీకే జాతీయ అధ్యక్షుడయ్యాడు. ఒక పార్టీ సిద్ధాంతాన్ని నమ్ముకుని, ఒకే నిబద్ధతతో పనిచేస్తే రాజకీయంగా ఏ స్థాయికి చేరుకోవచ్చునేదానికి రోల్‌మోడల్స్ వీళ్ళు. మన జిల్లా నాయకులు. దురదృష్టమేమిటంటే మన జిల్లాలో వున్న నాయకులే వారిని ఆదర్శంగా తీసుకోకపోతుండడం.***

ముఖ్యంగా నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ షేక్ అబ్దుల్ అజీజ్ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో నుండి తెలుగుదేశంలో చేరడం ఆయన వేసిన తప్పటడుగా? లేక తీసుకున్న తప్పుడు నిర్ణయమా? అనే సందేహాలను లేవనెత్తుతుంది. నెల్లూరు మేయర్ పదవి ముస్లిం వ్యక్తిని వరించడం చాలా అరుదైన విషయం. రాష్ట్ర రాజకీయ రంగంలోకి జగన్ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాకపోయి వుంటే ఖచ్చితంగా ఇది జరిగేది కాదు. జగన్ కాబట్టే నెల్లూరు మేయర్ పదవికి చాలా ధైర్యంగా ముస్లిం వ్యక్తిని ఎంపిక చేయగలిగాడు. ఇదే అజీజ్ మున్సిపల్ ఎన్నికలకు ముందే మేయర్ సీటు కోసం తెలుగుదేశం నాయకులను సంప్రదించాడు. అయితే వాళ్లు గ్యారంటీ ఇవ్వలేదు. కాని జగన్ మాత్రం ఎటువంటి చర్చలు, వూహాగానాలకు తావులేకుండా అజీజ్‌కు మేయర్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసారు.

మరి ఈరోజు అజీజ్ చేసిందేమిటి? వైకాపాను వదిలి తెదేపాలో చేరినందువల్ల ఆయనకొచ్చే లాభం ఏమిటి? అభివృద్ధికి రాజకీయాలకు సంబంధం లేదు. ఎన్నికలయ్యాక ఏ పార్టీ అధికారంలో వున్నా రాజకీయాలకతీతంగా అభివృద్ధిని కొనసాగించాల్సిందే. అభివృద్ధి కోసం తెలుగుదేశంలో చేరానని అజీజ్ చెప్పుకోవడాన్ని ఎవరూ సమర్థించరు. ఇక ఎమ్మెల్యేలతో విభేదాలా...? ఎమ్మెల్యే సీటుకు ఇద్దరు వ్యక్తులు పోటీ పడ్డప్పుడు వారి మధ్య విభేదాలు సహజమే. ఇప్పుడే కాదు భవిష్యత్‌లో కూడా అజీజ్ వల్ల తనకు ఇబ్బంది రావొచ్చని ఎమ్మెల్యే అనిల్ వూహించడంలో తప్పేమీ లేదు. అనిల్ మీద కారణంతో అజీజ్ ఈరోజు మున్సిపల్ కౌన్సిల్ తొలిసమావేశం కూడా జరగక ముందే పార్టీ మారాల్సిన అవసరం లేదు.

మైనార్టీ వర్గాల నుండి అజీజ్ లాంటి నాయకులు చాలా తక్కువగా వస్తుంటారు. గత మూడు దశాబ్దాల రాజకీయచరిత్రను చూస్తే ముస్లింలనుండి వచ్చిన గట్టి నాయకుడు అజీజ్. నెల్లూరు మేయర్‌ను సాధించగలిగాడు. ఆయనకు ఇంకా ఎంతో రాజకీయ భవిష్యత్ వుంది. పార్టీ మారకుండా మేయర్‌గా మంచిపేరు తెచ్చుకుని వుంటే రేపు ఏ పార్టీ అయినా సరే ఎమ్మెల్యే, ఎంపీ టిక్కెట్లు పిలిచి ఇచ్చేవి. ఎవరి సలహాతో ఆయన పార్టీ జంపింగ్‌కు పాల్పడ్డాడోగాని, ఇది ఆయన రాజకీయ భవిష్యత్ మీద తీవ్ర ప్రభావం చూపడం ఖాయం. వైకాపా నమ్మకం కోల్పోయాడు. ఇంత అర్జంట్‌గా పార్టీ మారి వచ్చిన ఆయనను తెలుగుదేశం నాయకులు నమ్మే పరిస్థితి కూడా వుండదు.

# అట్టహాసంగా నారాయణ నామినేషన్



ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులుగా ఎమ్మెల్యేల కోటా నుంచి ఎన్నిక కోసం మునిసిపల్ శాఖా మంత్రి డా॥ పి.నారాయణ 11వతేదీ ఉదయం 11.45గంటలకు నామినేషన్ పత్రాలు దాఖలు చేసారు. హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్ శాసనసభ కార్యదర్శికి ఆయన కార్యాలయంలో నామినేషన్ పత్రాలను అందజేసారు. నెల్లూరుజిల్లాకు చెందిన తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, బి.రామారావులతో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, పార్టీ జిల్లా సీనియర్ నాయకులు వేనాటి రామచంద్రారెడ్డి, ఆ జిల్లాకు చెందిన మాజీ మంత్రులు టి.రమేష్‌రెడ్డి, ఆదాల ప్రభాకరరెడ్డి, బల్లి దుర్గాప్రసాదరావు, పరసారత్నం హాజరైనారు. తెలుగుదేశం పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యుడు గరికిపాటి మోహనరావు, అనకాపల్లి పార్లమెంటు సభ్యులు అవంతి శ్రీనివాసరావు, ఛీఫ్ విప్ కాలువ శ్రీనివాసులు, శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి, పీలా గోవింద్ సత్యనారాయణ, పల్లా శ్రీనివాసరావు, కె.ఎస్.ఎన్.రాజు, డా॥కె.అప్పలనాయుడు, డా॥బి.వి.జయనాగేశ్వరరెడ్డి, కూన రవికుమార్ నెల్లూరు కార్పొరేషన్ మేయర్ అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు.

### నెల్లూరు నుంచి భారీగా తరలి వచ్చిన నాయకులు

తమ జిల్లాకు చెందిన మునిసిపల్ శాఖామంత్రి డా॥పి.నారాయణ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి పెద్దసంఖ్యలో జిల్లా నాయకులు హాజరైనారు. నారాయణ సన్నిహితులు, మిత్రులు, బంధువులతో పాటు జిల్లాకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు దేశాయిసెట్టి హనుమంతరావు, చాట్ల నరసింహారావు, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, ఆత్మకూరు పార్టీ ఇన్‌ఛార్జ్ కన్నబాబు, గూడూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ జ్యోత్సలత, వై.రాజగోపాల్, డి.శ్రీనివాసులు, అంచలవాణి, బుర్రా వెంకటేశ్వర్లు గౌడ్‌లతో పాటు కార్పొరేటర్ దొడ్డపనేని రాజా, ఎ.ఓబుల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ డి.వి.ఎస్.గిరి, ఆనం వెంకటరమణారెడ్డి, ఇండ్ల రాఘవేంద్ర, అంచల గణపతి, ఎల్.సుబ్బారావు, పి.కృష్ణయ్య, కె.మోహనరావు, హంససురేష్, రవికుమార్‌యాదవ్, హరిబాబుయాదవ్ తదితరులు నెల్లూరు జిల్లా నుంచి తరలి వచ్చి నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 'దేశం'లో అసమ్మతి కుంపట్లు

- ఆదిలోనే విభేదాల ఇక్కట్లు
- వర్గపోరుతో జిల్లా పార్టీ సతమతం



జిల్లాలో తెలుగుదేశంపార్టీ ఒక విచిత్రమైన వాతావరణంలో ఉంది. జిల్లాలో తెలుగుదేశంను బలోపేతం చేయాలనో, లేక వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీని లేకుండా చేయాలనో ఆ పార్టీ నాయకులు కొందరు చేస్తున్న ప్రయత్నాలు వికటిస్తున్నాయి. ప్రజల్లో పార్టీ పట్ల అవి వ్యతిరేకభావనను పెంచుతున్నాయి. ఇప్పటికిప్పుడు పార్టీకి అవసరం లేకపోయినా పనిగట్టుకుని కొందరు వైకాపా నాయకులను ఫిరాయింపు దిశగా ప్రోత్సహిస్తుండడం విమర్శలకు దారితీస్తుంది. ముఖ్యంగా పార్టీ ప్రతిపక్షంలో వున్న పదేళ్లు జెండాలు మోసిన కార్యకర్తలు, నాయకులు ఈ పరిమాణాలు చూసి బాధపడుతున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిందన్న సంతోషంకంటే ఈ ఫిరాయింపులు చూసి విచారించాల్సి వస్తుందంటున్నారు. పార్టీ పరంగా జిల్లాలో జరుగుతున్న కొన్ని నిర్ణయాలు తెలుగుదేశం సీనియర్ నాయకులకు మింగుడుపడడం లేదు. పార్టీ కష్టాల్లో ఉన్న సమయంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర, బీద మస్తాన్‌రావు, బల్లి దుర్గాప్రసాద్, పరసా రత్నం, ఇంకొందరు నాయకులు కనిపెట్టుకునే ఉన్నారు. పార్టీ కోసం వీళ్లు ఆర్థికంగా అంతో ఇంతో నష్టపోయారు. ఇప్పుడు పార్టీ అధికారంలోకి వచ్చింది. కాని జిల్లాలో చూస్తే పార్టీలో కీలక నిర్ణయాలు మాత్రం వీరికి సంబంధం లేకుండానే జరిగిపోతున్నాయి. అంతేకాదు, నిన్న మొన్నటివరకు కాంగ్రెస్, వైయస్సార్ కాంగ్రెస్ వంటి పార్టీలలో వున్న నాయకులు ఈరోజు తెలుగుదేశంలో పెత్తనం చెలాయిస్తుండడం చూసి సీనియర్ల కడుపులు మండిపోతున్నాయి.

జిల్లా రాజకీయాలతో ఎటువంటి సంబంధం లేకపోయినా పి.నారాయణ ఈ జిల్లా నుండి మంత్రిగా ఉన్నారు. జిల్లా రాజకీయాలపై ఆయనకు అవగాహన తక్కువ. ముఖ్యంగా వర్గ రాజకీయాల వాసనలు తెలియవు. చంద్రబాబు చెప్పాడని చెప్పి మిగతా నాయకులతో సంబంధం లేకుండానే సొంతంగా కొన్ని నిర్ణయాలు తీసేసుకుంటుండడం మిగతా నాయకులకు మింగుడు పడడం లేదు. ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నుండి మేయర్‌గా ఎన్నికైన అజీజ్‌ను తెలుగుదేశంలోకి చేర్చుకోవడం విమర్శలకు దారితీస్తుంది. ఎవరినడిగి అజీజ్‌ను చేర్చుకుంటున్నారు. ఇప్పుడాయనను అంత అర్జంట్‌గా చేర్చుకోవాల్సిన అవసరమేముందని పార్టీ వర్గాలే ప్రశ్నిస్తుండగా సామాన్య ప్రజలు, తెలుగుదేశం సానుభూతిపరులు కూడా ఈ నిర్ణయాన్ని అసహ్యించుకుంటున్నారు. ఈరోజు మంత్రి కాబట్టి, చేతిలో అధికారం వుంది. నారాయణ ఏది చేసినా చెల్లుబాటవుతుంది. మరి పార్టీనే నమ్ముకుని, పార్టీ కోసం డబ్బులు పోగొట్టుకున్న వాళ్లకు ఏం న్యాయం చేస్తారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అజీజ్ అర్జెంట్‌గా తెలుగుదేశంలోకి రానంతమాత్రాన ఈ ప్రభుత్వం పడిపోయేదేమీ లేదు. ఒక ట్రెండు చోట్ల ప్రతిపక్షం అధికారంలో వున్నంత మాత్రాన హైరానా పడాల్సిందేమీ లేదు. ప్రజాతీర్పును గౌరవించి గెలిచిన పార్టీలోనే వారిని ఉండనిస్తే అధికారపార్టీకి ఆ గౌరవం దక్కుతుంది.

# ప్రకాశిస్తున్న వివేకా



మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డిని కాంగ్రెస్ పార్టీవాళ్లు ప్రకాశంజిల్లా పరిశీలకుడిగా నియమించారు. కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రంలో అనాధగా మిగిలింది. బొల్లినేని ఆసుపత్రిలో కోమాలో వున్న పేషంట్‌కు కాంగ్రెస్‌కు పెద్ద తేడా లేదనుకోవచ్చు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు బ్రతుకు లేదని తెలిసి చాలామంది నాయకులు ఎన్నికలకు ముందే తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్‌లలోకి సర్దుకున్నారు. ఎన్నికల ఫలితాలు చూసాక ఇక ఎవరికి కూడా కాంగ్రెస్‌లో ఉండాలనిపించడం లేదు. కాని వివేకా అలా కాదు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ జీవచ్ఛవంగా మిగిలిపోనుందని తెలిసినా పార్టీని వీడి బయటకు రాలేదు. ఇతర పార్టీలలోకి పోవాలన్న ఆలోచన చేయలేదు. కాంగ్రెస్‌నే అంటిపెట్టుకుని ఉన్నాడు. ఆయన తమ్ముడు మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలుగుదేశంలో చేరుతాడనే ప్రచారం జరుగుతుంది. కాని వివేకా మీద ఆ ప్రచారం లేదు. కాకపోతే ఈమధ్య కాంగ్రెస్‌కు మింగుడుపడని విధంగా ఆయన వ్యాఖ్యలు చేస్తున్నాడు. ఋణమాఫీపై ప్రభుత్వం మాట తప్పిందని, దీనికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేయాలని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి పిలుపునిచ్చారు. దీనిపై వివేకా కర్ర విరగదీసి పెట్టినట్లుగా స్పందించారు. ఇలాంటి పనికిమాలిన ఆందోళనలు తాను చేయనని కుండ బద్ధలు కొట్టినట్లు చెప్పారు. ఏ పని లేకుండా ఖాళీగా వుంటే ఇలాగే అడ్డంగా మాట్లాడుతుంటాడని గ్రహించిన కాంగ్రెస్ పెద్దలు ఆయన మెడకు ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పరిశీలకుడు అనే గంటను తగిలించారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు




## గ్రామస్టేజీని పునరుద్ధరించాలి

విడవలూరు మండలంలోని పీర్లచావిడి గ్రామస్టేజీని పునరుద్ధరించాలి. కొందరు వ్యక్తులు దీనిని ఆక్రమించారు. కొన్ని వందల సంవత్సరాల నుండి గ్రామసభలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చిన గ్రామస్టేజీని కొందరు వ్యక్తులు పగలగొట్టి కబ్జా చేశారు. కొందరు బంకులు పెట్టుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని గ్రామ స్టేజీని పునరుద్ధరించాలి.

*యం.ప్రసాద్, విడవలూరు.*

## పిచ్చితుగ్లక్

కేసీఆర్ మరో పిచ్చితుగ్లక్‌లా తయారవుతున్నాడు. వీధికెక్కి అరిచే దానికి, వసూళ్లకు కేసీఆర్ కుటుంబం అంకితమైంది. 1956కు ముందువారే తెలంగాణ వారనడం, ఎంఐఎంతో పొత్తు, రాష్ట్ర జెండాలో మతపరమైన ఛార్మినార్‌ను వేయడం అతని దొరతనాన్ని బయటపెడుతున్నాయి. ఉదయాన్నే ప్రొక్లెయిన్‌లతో ఆంధ్రావాళ్ల భవనాలను కూల్చేయడం, సాయంత్రానికి సంచుల కొద్ది డబ్బు దండుకోవడం ఆ కుటుంబానికి ఆచారమైపోయింది. హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా చేస్తే కేసీఆర్ పిచ్చి కుదురుతుంది.

*వాస్తు రామచంద్ర, నెల్లూరు.*

## పి.వి.ని గౌరవించాలి

స్వాతంత్ర్య సమరయోధులు నేతాజీ సుభాష్‌చంద్రబోస్, మాజీ ప్రధాని వాజ్‌పేయిలు భారతరత్నకు అన్నివిధాలా అర్హులు. అయితే అదే సమయంలో మన తెలుగువాడు మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు సేవలకు కూడా సముచిత గౌరవం కల్పించాల్సివుంది. ఆయనను సొంత పార్టీ కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసింది. కష్టకాలంలో దేశాన్ని ఆర్థిక సంస్కరణలవైపు నడిపించి ఆదుకున్న నాయకుడాయన. ఆయనను కనీసం ఎన్డీఏనన్నా గుర్తించాలి.

*జె.భాస్కర్‌శాస్త్రి, హైదరాబాద్.*

## తప్పేముంది

మహిళలు సంప్రదాయ వస్త్రధారణ చేయాలని పార్లమెంటులో మురళీమోహన్ అన్న మాటల్లో తప్పేమీ లేదు. మన సంప్రదాయానికి తగ్గట్లే మాట్లాడారు.

*వి.యస్.మురళి,నెల్లూరు.*

# 'ప్రభా'తం

'చేతిలో డబ్బులు లేక తల్లిదండ్రులకు చికిత్స చేయించలేకపోవడం, పిల్లలను చదివించుకోలేక అవస్తలు పడడం, చివరికి సెలవులకు ఇళ్ళకు వెళ్ళేటప్పుడు రైళ్ళలో రిజర్వేషన్ లేక ఇబ్బందులు పడుతుండడం.. ఇలాంటివెన్నో సమస్యలను సైనికులు, సైనికుల కుటుంబాలు నిత్యం ఎదుర్కొంటూనే వుంటాయి. అయినప్పటికీ, వారు విధి నిర్వహణలో మాత్రం అలాంటివేమీ పట్టించుకోరు.. వారి కర్తవ్యదీక్ష అలాంటిది'.. అంటూ భారత ప్రధాని నరేంద్ర మోడీ వీర జవాన్ల దేశభక్తిని, కర్తవ్యదీక్షను కొనియాడుతూ చేసిన ప్రసంగం అందరినీ ఎంతో ఆకట్టుకుంది..

ఈ నెల 12న జమ్మూ కాశ్మీర్‌లోని లేహ్, లడక్ ప్రాంతాల్లో ప్రధాని మోడీ పర్యటించి, అక్కడ సైనికులనుద్దేశించి ప్రసంగించారు. సరిహద్దు వెంబడి అనుక్షణం పహారా కాస్తూన్న సైనిక బలగాలకు మోడీ మాటలు మరెంతో ధైర్యాన్నీ, స్థైర్యాన్నీ కలిగించాయి. సరిహద్దు సైనికుడే తనకు స్ఫూర్తి అని, అమర జవాన్ల కోసం త్వరలో జాతీయస్థాయిలో స్మారక కట్టడం నిర్మిస్తామని ప్రధాని మోడీ ఈ సందర్భంగా హామీ ఇవ్వడం సైనికుల్లో ఎంతో ఉత్తేజాన్ని కలిగించింది. స్వాతంత్ర్యానంతరం నాలుగు యుద్ధాలు జరిగి, వేలాదిమంది జవాన్లు మరణించినా, నేటికీ ఒక స్మారక స్థలం లేకపోవడం విచారకమని ఆయన అంటూ, భావితరాలవారు సైతం మంచి ప్రేరణ పొందేవిధంగా జాతీయస్థాయి స్మారక నిర్మాణాన్ని ప్రభుత్వం చేపడుతుందని ఆయన అన్నప్పుడు సైనికులు హర్షధ్వానాలు చేశారు. ప్రధాని మాటలు వారిలో నూతనోత్తేజాన్ని, మరింత స్ఫూర్తినీ కలిగించాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాని మోడీ జమ్ము కాశ్మీర్‌లో పర్యటించడం ఇది రెండవ సారి. ఈ పర్యటన సందర్భంగా, ప్రధాని మోడీ తన ప్రసంగంలో భారత్‌పై పాక్ అనుసరిస్తున్న వ్యతిరేక వైఖరిని ఘాటుగా విమర్శించారు. ఇటీవల పాక్ కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లంఘనానికి పాల్పడుతుండడం, జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడులు పెరిగిపోతుండడం..తదితరాలను దృష్టిలో వుంచుకుని ప్రధాని మోడీ పాక్ తీరుపై ధ్వజమెత్తారు. పాక్ కవ్వింపు చర్యలను నిరసిస్తూ, పాక్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్‌ను నేరుగా ఎదుర్కొనే సత్తా లేకనే, పాకిస్తాన్ ఉగ్రవాదం మాటున కపటయుద్ధం చేసేందుకు ప్రయత్నిస్తోందని ప్రధాని మండిపడ్డారు. ఉగ్రవాదం రూపంలో ఆ దేశం పరోక్ష యుద్ధానికి దిగి అమాయకులను బలి తీసుకుంటోందని, యుద్ధంలో మరణించే సైనికులకన్నా ఉగ్రవాద చర్యలతో ఎక్కువమంది సైనికులు మరణిస్తున్నారని ఆయన అన్నారు. అందువల్ల ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మానవతా శక్తులన్నీ ఒక తాటిమీదకు రావాల్సిన అవసరం వుందని'.. ప్రధాని స్పష్టం చేశారు. ప్రధాని ప్రసంగం ఆద్యంతం ఎంతో ధీరగంభీరంగా సాగి, అందరినీ ఆకట్టుకుంది. సైనిక బలగాల్లో నూతనోత్తేజాన్ని నింపింది. అంతేకాదు, అత్యాధునికమైన ఆయుధ సామర్ధ్యం, అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం పుణికి పుచ్చుకున్న శక్తివంతమైన సైనిక నిర్మాణానికి భారత్ కట్టుబడి వుందన్నారు. ప్రధాని విస్పష్టంగా పేర్కొంటున్న ఆ మాటలన్నీ భారత సైనికుల్లో ఎంతో భరోసా కలిగించాయి. సైనికుల కుటుంబాల్లో ఎన్నో సమస్యలు వున్నప్పటికీ కర్తవ్యదీక్షతో, దేశభక్తితో పనిచేసే వీరజవాన్ల నుంచి తాను స్ఫూర్తిని పొందుతున్నాననడం ప్రధాని హృదయౌన్నత్యానికి నిదర్శనం. అహరహం దేశసేవ చేస్తున్న జవాన్ల వెంట దేశం నిలబడి వుందంటూ ఆయన సైనికుల్లో స్ఫూర్తిని, ఉత్సాహాన్ని నింపారు. సరిహద్దులో వున్న మిమ్మల్ని ప్రత్యేకంగా కలుసుకుని మీ నుంచి స్ఫూర్తిని పొందడానికి తరచూ తానిక్కడికి వస్తుంటానని ప్రధాని అనడంతో సైనికుల్లో ఆనందోత్సాహాలు మిన్నంటాయి. ఈ పర్యటన సందర్భంగా ప్రధాని మోడీ, అభివృద్ధికి శాంతి సామరస్యాలే ప్రధానభూమికలుగా వుంటాయని సైనికదళాల రిజిస్టర్‌లో రాసి ప్రగతి పట్ల, శాంతి సామరస్యాల పట్ల తనకున్న అభిమానాన్ని ప్రకటించారు.

ప్రధాని నరేంద్ర మోడీ తన పర్యటనలో భాగంగా లేహ్‌కార్గిల్‌ను సందర్శించారు. లడఖ్ ప్రాంతానికి ఎంతో ప్రయోజనం కలిగించే నిమూబజ్గో జలవిద్యుత్ ప్రాజెక్టును ప్రారంభించడం, లేహ్-కార్గిల్-శ్రీనగర్ ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను ప్రారంభించడం, కార్గిల్‌లో 44 మెగావాట్ల జలవిద్యుత్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించడం, జమ్ముకాశ్మీర్‌లో రహదారుల నిర్మాణాలకు ఎనిమిది వేల కోట్ల రూపాయలను ప్రకటించడం అటు అభివృద్ధి పరంగా, ఇటు నైతికంగా అందరిలోనూ ఎంతో ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని కలిగించాయి. ఆ తర్వాత లడక్‌లోని పోలో మైదానంలో జరిగిన భారీ బహిరంగసభలో ప్రధాని మాట్లాడుతూ, జమ్ము కాశ్మీర్‌లో 20 శాతం మంది దాకా నిర్వాసితులు వున్నారని, వారికి త్వరలోనే పునరావాసం కల్పిస్తామని కాశ్మీర్ పండిట్ల సమస్యను ప్రస్తావిస్తూ అన్నారు. నిర్వాసితులైన కాశ్మీర్ పండిట్ల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడివుందని ప్రధాని చెప్పడంతో అక్కడి ప్రజలందరికీ ఎంతో భరోసా ఇచ్చినట్లయింది. అంతేకాదు, జమ్ముకాశ్మీర్‌లో పొద్దుతిరుగుడు పంట విస్తారంగా పండుతోంది. ఆ పంటను పండించే రైతుల సంక్షేమానికి కృషిచేస్తామని కూడా ప్రధాని హామీ ఇవ్వడం అక్కడి రైతాంగానికి ఎంతో ఊరట కలిగించినట్లయింది. ఈ ప్రాంతాల్లో ప్రధాని పర్యటన అటు సైనికుల హృదయాల్లో ఎంతో సంతోషాన్ని కలిగించింది. ప్రజల్లోనూ ఎనలేని ఉత్సాహాన్ని నింపింది. ఏదేమైనా భారత ప్రధాని నరేంద్రమోడీ జమ్ము కాశ్మీర్ పర్యటన ఎంతో అర్ధవంతంగా.. విజయవంతంగా.. స్ఫూర్తిదాయకంగా సాగింది.



## స్ఫూర్తిదాయకం

**ప్రధాని నరేంద్రమోడీ జమ్మూ కాశ్మీర్ పర్యటన ఎంతో స్ఫూర్తిదాయకంగా సాగింది. సరిహద్దు వెంబడి అనుక్షణం పహారా కాస్తూన్న సైనిక బలగాలకు మోడీ ప్రసంగం మరెంతో ధైర్యాన్నీ, స్థైర్యాన్నీ కలిగించింది.**

# 'అంతర్'జాతీయం

- ఇరాక్‌లో యూజిపీ మైనార్టీలను ఇస్లామిక్ తీవ్రవాదులు ఊచకోత కోస్తుంటే చూస్తూ ఊరుకోబోమని అమెరికా అధ్యక్షుడు ఒబామా హెచ్చరించారు. ఇస్లామిక్ తీవ్రవాదులకు వ్యతిరేకంగా ఇరాక్‌లో మైనార్టీలకు మద్ధతుగా తమ దేశం ప్రారంభించిన వైమానిక దాడులను ఆయన సమర్ధించారు.
- క్విట్ఇండియా ఉద్యమం 72వ వార్షికోత్సవం సందర్భంగా స్వాతంత్ర్య సమర యోధులకు రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ సెల్‌ఫోన్‌లను బహుకరించారు. ఈ నెల 9న రాష్ట్రపతిభవన్‌లో నిర్వహించిన 'ఎట్‌హోం' కార్యక్రమంలో రాష్ట్రపతితో పాటు ఉప రాష్ట్రపతి అన్సారీ, ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అరుణ్‌జైట్లీ కూడా పాల్గొన్నారు.
- శాస్త్రీయ ప్రయోగాలు నిర్వహించడానికి, ప్రకృతి విపత్తుల సమయంలో ముందస్తు హెచ్చరికలు చేయడానికి ఈ నెల 9న చైనా ప్రయోగించిన రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహం 'యువోగాన్-20' విజయవంతమైంది.
- చైనాను భారత విరోధిగా చూడొద్దని అమెరికా రక్షణమంత్రి చుక్‌హెగెల్ వ్యాఖ్యానించారు. అమెరికా, చైనాలలో సంబంధాలలో ఎవరిని ఎంచుకోవాలన్న మీమాంస అక్కరలేదని, ఇరుదేశాలతో భారత్ సత్సంబంధాలను కొనసాగించవచ్చని భారత పర్యటనకు వచ్చిన ఆయన చెప్పారు.
- కాశ్మీర్ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని ప్రగాఢంగా కోరుకుంటున్నట్లు కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ స్పష్టం చేశారు. ఇందుకోసం ఏజెంట్లనెవరినీ తాము రంగంలోకి దించబోమని ఆయన రాజ్యసభలో ప్రకటించారు.
- ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో తగినన్ని ఓట్లు రానందున మూడు పార్టీలు జాతీయ హోదాను కోల్పోయే ప్రమాదంలో పడ్డాయి. బిఎస్పీ, ఎన్సీపీ, సీపీఐలకు జాతీయ హోదాను ఎందుకు ఉపసంహరించకూడదో తెలపాల్సిందిగా కోరుతూ ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసింది.
- గత ఆర్థిక సంవత్సరం (2013-14)లో పన్ను ఎగవేతకు, అనుమానాస్పద నిధులకు సంబంధించి దాదాపు 24వేల ఉదంతాల సమాచారాన్ని భారత్ సంపాదించింది. వీదేశీ బ్యాంకుల్లోని భారతీయులకు సంబంధించిన ఆ సమాచారాన్ని న్యూజిలాండ్, యుకె, స్పెయిన్, స్వీడన్, డెన్మార్క్ వంటి 12దేశాలు అందించాయి.
- ఇరాక్ రాజధాని టెహ్రాన్ నుండి తాబస్‌కు వెళుతున్న ఓ విమానం 10వ తేదీ రోడ్డుపైనే కూలిపోయింది. ఈ ప్రమాదంలో 39మంది చనిపోయారు.

# వార్త - వ్యాఖ్య

వార్త :- 20ఏళ్ల పాటు విపక్షం ఉండదు. - చంద్రబాబు.
**వ్యాఖ్య :- *కేంద్రంలోనా... ఇంకేదన్నా రాష్ట్రంలోనా?***

వార్త :- జిల్లాకో వ్యవసాయ విశ్వవిద్యాలయం. - మంత్రి పుల్లారావు.
**వ్యాఖ్య :- *ముందు రాష్ట్రం మొత్తానికి ఒకటి ఏడవండి చాలు.***

వార్త :- కేసీఆర్ నియంతలా వ్యవహరిస్తున్నారు. - మంత్రి పల్లె రఘునాథరెడ్డి.
**వ్యాఖ్య :- *నిజాంలాగా వ్యవహరిస్తున్నాడంటే ఒక్క మాటతో పోలా...!***

వార్త :- జగన్ అక్రమాస్తులు 43వేల కోట్లు. - సోమిరెడ్డి.
**వ్యాఖ్య :- *ఆడిటింగ్ మీరే చూస్తున్నట్లు చెప్పారే!***

వార్త :- అండగా నిలిస్తే పార్టీ నుండి వెలివేశారు. - వైకాపాకు జూపూడి రాజీనామా.
**వ్యాఖ్య :- *తెలుగుదేశంలోకి పోవాలంటే జగన్‌ను తిట్టాల్సిందే!***

వార్త :- చర్చించుకుంటేనే సమస్యల పరిష్కారం. - ఇద్దరు సీఎంలకు రాఘవులు సూచన.
**వ్యాఖ్య :- *సమస్యలు పరిష్కారమైతే వారికి పనేముంటుంది.***

వార్త :- బాబు మాటలు మయసభను మించిపోయాయి. - ఏపిసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి.
**వ్యాఖ్య :- *మాటలు ఆకాశంలో... చేతలు పాతాళంలో అంటారా?***

వార్త :- ఋణమాఫీ ఆటంకాలను అధిగమిస్తాం. - ఎంపీ కంభంపాటి.
**వ్యాఖ్య :- *ప్రభుత్వకాలం పూర్తయ్యేనాటికా?***

వార్త :- భాజపా దేశాన్ని ముంచుతుంది. - ప్రకాశ్‌కారత్ ధ్వజం.
**వ్యాఖ్య :- *మీకున్న దేశభక్తి వాళ్లకు లేదంటారా?***

వార్త :- గవర్నర్‌కు అధికారాల అప్పగింత సరికాదు. - తెలంగాణ మంత్రిమండలి నిరసన.
**వ్యాఖ్య :- *మరి మీకు అధికారమిస్తే కోతికి కొబ్బరిచిప్ప ఇచ్చినట్లుగా అయ్యిందే!***

వార్త :- మున్సిపాల్టీలలో కొత్త పన్నులుండవ్. - మున్సిపల్ మంత్రి నారాయణ.
**వ్యాఖ్య :- *ఇప్పుడున్న పన్నులు కట్టడానికే ఆస్తులమ్మాల్సివస్తుంది లేండి!***

# కీచక టీచర్లు

క్రమశిక్షణ, మంచి నడవడిక నేర్పి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయులే దారి తప్పుతున్నారు. తమ వికృత చేష్టలతో ఉపాధ్యాయవృత్తికే కళంకం తెస్తున్నారు. అభంశుభం తెలియని చిన్నారులను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నారు. మంగళవారం ఒకేరోజు రెండుచోట్ల ఇటువంటి విషయాలు వెలుగులోకి వచ్చాయి. పొదలకూరు మండలం తాటిపర్తిలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో ఎన్.రమేష్ అనే ఉపాధ్యాయుడు 4, 5తరగతుల విద్యార్థినులకు పాఠాలు చెప్పేవాడు. విద్యార్థినులతో చొరవగా ఉంటూ వికృత చేష్టలకు పాల్పడసాగాడు. కొంతకాలం పాటు విద్యార్థినులు మౌనంగా భరించారు. కాని ఇద్దరు విద్యార్థినులు మాత్రం తమ తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో సోమవారం వాళ్లు ఈ కీచక ఉపాధ్యాయుడికి బుద్ధి చెప్పాలని స్కూల్‌కు వచ్చారు. విషయం పసిగట్టిన ఉపాధ్యాయుడు పరారయ్యాడు. కొంతమంది నాయకుల ద్వారా ఇతను మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వద్ద కెళ్ళి తనను కాపాడాలని కోరినట్లు తెలిసింది. అయితే ఆయన మాత్రం ఇటువంటి ఛండాలపు పనులకు సిఫారసు చేయమని తన వద్దకు రావద్దని తిట్టి పంపినట్లు తెలుస్తుంది.

అదేవిధంగా ఉదయగిరి మండలం వడ్డిపాలెంలో మరో ఉదంతం చోటుచేసుకుంది. ఇక్కడ ప్రాథమిక పాఠశాలలో కప్పా పెంచలరాజు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం భోజనం సమయంలో పిల్లలందరూ ఆడుకుంటుండగా పెంచలరాజు గదిని శుభ్రం చేయాలంటూ నాలుగోతరగతి చదువుతున్న విద్యార్థినిని లోపలకు పిలిచాడు. ఆమెతో అసభ్యంగా ప్రవర్తించసాగాడు. అంతలో ఆ బాలిక తల్లి అటుగా వచ్చి ఉపాధ్యాయుడి పైశాచికాన్ని చూసింది. ఆమె అపరకాళికాదేవిలా ఉగ్రరూపమెత్తి కాలి చెప్పుతో ఆ ఉపాధ్యాయుడి చెంపలు వాయించింది. వెంటనే చుట్టుపక్కలవారు అక్కడకు చేరుకుని ఈ కీచక గురువుకు దేహశుద్ధి చేశారు. ఈ రెండు కేసులను ఆయా స్టేషన్ల పోలీసులు విచారిస్తున్నారు.


## ఆప్యాయంగా, ఆనందంగా రాఖీపూర్ణిమ

రాఖీపూర్ణిమ సందర్భంగా నెల్లూరు శ్రీనివాస అగ్రహారంలోని శ్రీ నేతాజీ (ఎంఎస్ఆర్) పైలట్ హైస్కూలు ఆవరణలో ఈనెల 9న రక్షాబంధన్ కార్య క్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ అన్నాచెల్లెళ్ళ అనుబంధానికి ప్రతీకగా ప్రతి సోదరి తన సోదరునికి 'నీవు నాకు రక్ష, నేను నీకు రక్ష' అని రక్షణ చిహ్నంగా రాఖీనికట్టడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. చదువుతో పాటు ఆల్‌రౌండ్ డెవలప్‌మెంట్, వ్యక్తిగత విలువలు, సంప్రదాయాలు విద్యార్థులకు తెలియజేయుటలో భాగంగా రక్షాబంధన్ వంటి కార్యక్రమాలు జరుపుతున్నామన్నారు. అన్న, తమ్ముడు లేని అమ్మాయిలు, చెల్లెలు లేదా అక్క లేనటువంటి అబ్బాయిలు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించినపుడు చూడటం వలన సోదరులు లేనిలోటు చెల్లెలు, అక్క లేని లోటు తీరుతుందని తల్లిదండ్రులు తమ సంతోషాన్ని వ్యక్తం చేసారు.

## వ్యవసాయ యూనివర్శిటీ ఏర్పాటు చేయాలి

కొండాపురం మండలంలోని చింతలదేవి వ్యవసాయ క్షేత్రంలో దాదాపు 2700 ఎకరాల భూమి వుందని, దాని పక్కనే మరో 5వేల ఎకరాలు కూడా జింకలబీడు వుందని, చింతలదేవిలో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ఎంతో అనువైన వనరులున్నాయి కనుక, ఇక్కడ ఆ యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని సిపిఎం నేత, మాజీ ఎమ్మెల్యే జక్కా వెంకయ్య సూచించారు. ఇటీవల కావలిలోని షాదీమంజిల్‌లో జరిగిన సిపిఎం డివిజన్ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ వ్యవసాయ యూనివర్శిటీ ఏర్పాటుచేస్తే అటు ప్రకాశం, ఇటు నెల్లూరుజిల్లా ప్రజలకు ఎంతో ఉపయోగంగా వుంటుందని పేర్కొన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్, నాయకులు పి.శ్రీరాములు, ఎం. మోహన్‌రావు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆటోమొబైల్‌డీలర్స్ చేయూత



ది నెల్లూరు ఆటోమొబైల్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు ఈ నెల 14వ తేదీన నెల్లూరు, అపోలో సెంటర్‌లోని డాక్టర్ జెడిఆర్ ఆదర్శ పాఠశాల విద్యార్థులకు 80వేల రూపాయల విలువ జేసే యూనిఫాంలను అంద జేశారు. అసోసియేషన్ అధ్యక్షులు కొట్టే రామ్మూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, తెలుగుదేశం నాయకులు చాట్ల నరసింహారావు, డాక్టర్ వి.రాజేశ్వరరావులు పాల్గొని యూనిఫాంలు అందజేశారు. ఈ అసోసియేషన్ తరపున చేస్తున్న మంచి పనులను వీరు అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పి.వి.సత్యనారాయణ, కోశాధికారి ఎన్.మల్లికార్జుననాయుడు, ఉపాధ్యక్షులు శంకరయ్య, కె.సుధాకర్, సంఘ మాజీ అధ్యక్షులు ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, ఎడ్యుకేషన్ కమిటీసభ్యులు హరిప్రసాద్, సుధాకర్‌రెడ్డి, ఎన్.శ్రీనివాసులు, ఇతర సంఘసభ్యులు కె.సురేష్‌బాబు, ఎస్.రమేష్, షేక్ ముక్తియార్, ఏ.బుచ్చయ్య, సీనియర్ సభ్యులు కె.సుబ్బారావు, స్కూలు ప్రధానోపాధ్యాయులు, యితర ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, పాఠశాల సెక్రటరీ సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

### ఆదాయం పన్ను
## అధికారిక ఇ-మెయిల్ ఐడి

ఐ.టి రిటర్న్ దాఖలు ప్రక్రియ సురక్షితంగా పూర్తయ్యేందుకు వీలుగా తాము పంపే ఒక "ఆటో - జనరేటెడ్ పిన్‌తో కూడిన మెయిల్‌ను భద్రపరచుకోవలసిందిగా ఇ-రిటర్న్లు ఫైల్ చేసే అస్సెస్సీలకు ఆదాయపు పన్ను విభాగం విజ్ఞప్తి చేస్తున్నదని ఆంధ్ర చాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.వి.చలమయ్య తెలిపారు. పిన్ ఇచ్చిన మెయిల్ ఐడి (donotreply@incometaxindiaefilling.gov.in)ని పన్ను చెల్లింపుదారులు తమ ఇన్‌బాక్స్‌లలో వైట్/సేఫ్ లిస్ట్‌లో చేర్చి దాచుకోవాలని కోరింది. ఐ.టి విభాగం ఆన్‌లైన్ పోర్టల్‌లో పన్ను చెల్లింపుదార్లు ఇ-మెయిల్ ఐడి, ఫోన్ నెంబర్లు నమోదు చేసుకోవడంతోనే సిస్టమ్ ఒక ఆటో జనరేటెడ్ ఇమెయిల్‌ను పంపిస్తుందని ఐ.టి.వింగ్ సీనియర్ అధికారి తెలియజేసారని పేర్కొన్నారు.

### రద్దయిన పెంచలకోన...
## దేవస్థాన పాలక మండలి

రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడడంతో పెంచలకోన దేవస్థానంలోని పాలకమండలి మార్చుని రద్దు పరుస్తూ ఈనెల 10న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో రెండేళ్ళ క్రితం 10మంది సభ్యులతో చెన్ను తిరుపాల్‌రెడ్డి అధ్యక్షుడిగా పాలకమండలిని ఏర్పాటుచేయడం జరిగింది. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నామినేటెడ్ పోస్టుల్లో వున్న వారిని తమ పదవులకు రాజీనామా చేయాలని సూచించింది. దానికి స్పందించకపోవడంతో ఏకంగా ఆ మండలినే రద్దు చేస్తున్నట్టు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆదివారం నాడు ఈ ఉత్తర్వులు అందినట్టు ఆలయ ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్రీరామమూర్తి తెలిపారు.

## దేశంలోకి షఫి తనయుడు



మాజీకౌన్సిలర్ షేక్ షఫి తనయుడు, లయన్స్‌క్లబ్ - ప్రగతి అధ్యక్షుడు ఎస్.అబ్దుల్ రసూల్ ఈ నెల 11వ తేదీ తన అనుచరులతో కలిసి తెలుగుదేశంలో చేరారు. హైదరాబాద్‌లో మంత్రి పి.నారాయణ సమక్షంలో ఆయన పార్టీలో చేరారు.

### ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలపై
# సర్వహక్కులు మాకే

**నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి**



విద్యానగర్ ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలపై సర్వాధికారాలు తమకే వున్నాయని ఆ కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 13న కళాశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ అంశానికి సంబంధించి తనపై వేసివున్న దావాను గూడూరు సీనియర్ కోర్టు కొట్టివేసిందని, కోర్టు తీర్పు తమకు అనుకూలంగానే వచ్చిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కళాశాలపై పూర్తి హక్కులు తనకే వున్నాయని ఆయన పేర్కొన్నారు. కళాశాల గత నాలుగేళ్ళుగా ప్రగతిపథంలో నడుస్తోందని, కళాశాలను ఆధునికీకరించామని, నూతనంగా హాస్టల్స్‌తో పాటు, అకడమిక్ భవన సముదాయాన్ని నిర్మించామని తెలిపారు. ఇసిఇ, ఇఇఇ లేబొరేటరీలను రూ.52 లక్షలతో అప్‌గ్రేడ్ చేశామని, సివిల్ లేబొరేటరీలను రూ.40 లక్షలతో అభివృద్ధి చేశామని, కంప్యూటర్ సైన్స్ కోర్సులో 350 కంప్యూటర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కళాశాలకు అటానమస్ గుర్తింపు కూడా వుందన్నారు. ఈ సమావేశంలో రామ్‌కుమార్‌రెడ్డితో పాటు, జెఎన్‌టియు మాజీ వైస్ ఛాన్సలర్, కళాశాల ఛైర్మెన్ డాక్టర్ ఐ.గోపాల్‌రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ వి.విజయ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జేసీస్ చార్టర్‌నైట్




మాజీ అధ్యక్షులు కోట సత్యనారాయణ దంపతులను సత్కరిస్తున్న జేసీస్ సభ్యులు

జేసీఐ-నెల్లూరుటౌన్ వారు ఈ నెల 10వ తేదీన పప్పులవీధిలోని జేసీ భవన్‌లో సంస్థ 34వ చార్టర్‌నైట్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జోన్ అధ్యక్షులు బి.ఆంజనే యులు, డిప్యూటీ మేయర్ ఎం.ద్వారకానాథ్‌లు పాల్గొని సంస్థ చేస్తున్న సేవలను అభినందించారు. ఈ సందర్భంగా 18 మంది మాజీఅధ్యక్షులను, మహిళా అధ్య క్షులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జేసీస్ అధ్యక్షుడు సి.వి.శరణ్‌కుమార్, ఛైర్‌పర్సన్ ఉమారాణి, కార్యదర్శి వి.ఇ.మురళీకృష్ణ, కోశాధికారి ఎస్.వి.మహేష్‌బాబు, చింతాల మధుబాబు, శాంతి, సత్యం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


## ఉపాధ్యాయుల కొరత తీరుస్తాం



నెల్లూరులోని 45వ డివిజన్ రామ్మూర్తి నగర్, కర్నాలమిట్టలో వున్న మున్సిపల్ హైస్కూల్‌ను నెల్లూరు నగర శాసనసభ్యులు డా॥పి.అనిల్‌కుమార్‌యాదవ్ ఈ నెల 13న సందర్శించారు.

ఈ సందర్భంగా పాఠశాలలో సదుపాయాల విషయమై చర్చించారు. నగరంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బల్లలు, ఉపాధ్యా యుల కొరత తదితర సమస్యలున్నాయని, టీచర్ల భర్తీని త్వరలో చేపడుతామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ స్కూలులో ఐదు గురు టీచర్ల కొరత ఉందని, మూడేళ్లుగా తెలుగు, కంప్యూటర్ టీచర్లు లేరని, త్వరలోనే వారిని భర్తీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, కార్పొరేటర్లు ఓబిలి రవిచంద్ర, గోగుల నాగరాజు పాల్గొన్నారు.

## శ్రీ వెంకయ్యస్వామి జీవితచరిత్ర ఆవిష్కరణ



ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త అల్లు భాస్కరరెడ్డి భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి జీవిత చరిత్రను 'శ్రీ స్వామి సచ్చరిత్ర' అనే గ్రంథంగా రూపొందించారు. ఈ గ్రంథం గత నాలుగేళ్ళలో భక్తజనుల విశేషాదరణ పొంది నాల్గవ ముద్రణకు చేరుకుంది. ఎంతో ప్రసిద్ధమైన ఈ నిత్య పారాయణ గ్రంథానికి ఈ నెల 9న ఆవిష్కరణ జరిగింది. నెల్లూరులోని స్వర్ణవేదిక కల్యాణమండపంలో జరిగిన సమావేశంలో ఈ గ్రంథాన్ని తిరుపతి నుంచి విచ్చేసిన ప్రసిద్ధ ఆధ్యాత్మికవేత్త సముద్రాల లక్ష్మణయ్య ఆవిష్కరించి తొలిప్రతిని సాయిసదన్ నిర్వాహకులు కె.శ్రీనివాసులురెడ్డికి అందజేశారు. ప్రముఖ సాహితీవేత్త వాడ్రేవు చినవీరభద్రుడు గ్రంథ సమీక్ష చేశారు. ప్రొఫెసర్ జక్కంపూడి మునిరత్నం, డాక్టర్ మోహన్‌రాజు, సహస్ర సభాసింహం బివి నరసింహం, ఆచార్య ఆదిత్య, ప్రముఖకవి పెరుగు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. సన్నిధి కుటుంబం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

# నెల్లూరు కబుర్లు

## జగన్ వచ్చెళ్లాడు



వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 9వ తేదీ నెల్లూరొచ్చాడు. ఒంగోలు ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి సోదరుడు వై.వి.భద్రారెడ్డి కుమార్తె వివాహానికి హాజరయ్యేందుకు కడప నుండి రోడ్డు మార్గాన వచ్చిన ఆయనకు మర్రిపాడు, నెల్లూరు పాలెం, సంగం, బుచ్చి తదితర ప్రాంతాల్లో కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. నెల్లూరులో పినాకిని అతిథిగృహంలో జగన్ బస చేయడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు అక్కడకు పెద్దఎత్తున చేరుకున్నారు. జగన్‌ను కలుసుకునేందుకు కార్యకర్తలు భారీగా తరలిరావడంతో తోపులాట కూడా జరిగింది. విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన వివాహ వేడుకలకు హాజరైన జగన్ అదే రోజు రాత్రికి సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరి హైదరాబాద్ వెళ్లాడు.

## మా బాధలు ఆలకించండి

### మంత్రి శిద్దాకు ప్రైవేట్‌స్కూళ్ళ సంఘం వినతి



జిల్లా ప్రైవేట్‌స్కూళ్ళ సంఘం నాయకులు ఈ నెల 9న ఒంగోలుకు వెళ్ళి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి శిద్దా రాఘవరావును కలిసి తమ బాధలు వెల్లడించారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇచ్చిన బస్సులపై కూడా రవాణా శాఖ అధికారులు దాడులు చేస్తున్నారని, ఇది ఎంతవరకు సమంజసమని ఈ సందర్భంగా ప్రైవేట్ స్కూళ్ళ యజమానులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల గూడూరు నియోజకవర్గంలో ఒక పాఠశాల బస్సు ప్రమాదానికి గురైతే, జిల్లా అంతటా తనిఖీల పేరుతో బస్సులన్నిటినీ ఒకచోట చేర్చడం వల్ల విద్యార్థులు సమయానికి ఇళ్ళకు చేరలేక ఇబ్బందిపడ్డారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ బాధలు ఆలకించి, సమస్యలు పరిష్కరించాల్సిందిగా వారు మంత్రికి వినతిపత్రం సమర్పించారు.

ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు బి. మనోహర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఎం.వి.సుబ్బారెడ్డి, దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మునిసిపల్ స్కూల్‌కి ఫ్యాన్లు వితరణ



ఆదర్శ ఫౌండేషన్ ద్వారా మద్రాసు బస్టాండ్ వద్ద ఉన్న సుంకు చెంగన్నశెట్టి మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌కి షుమారు రూ.20వేలు విలువ చేసే 10సీలింగ్‌ఫ్యాన్లు రాఘవేంద్రషెట్టి, వారి కుటుంబ సభ్యుల ద్వారా ఇవ్వడం జరిగింది. గతంలో ఈ స్కూల్‌కి సుమారు రూ.80వేలు విలువచేసే డస్కులు కూడా ఆదర్శ ఫౌండేషన్ ద్వారా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆదర్శ ఫౌండేషన్ ఛైర్మెన్ ఎస్.రాఘవేంద్రషెట్టి మాట్లాడుతూ పిల్లల పుట్టినరోజున పేదపిల్లలకు ఉపయోగపడే సేవాకార్యక్రమం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో విజయకుమార్‌షెట్టి, స్కూల్ హెడ్‌మాస్టర్ ఎ.జగదీశ్వరరావు, ఉపాధ్యాయులు స్వర్ణ రమేష్‌బాబు, ఎన్.సి.మస్తానయ్య, శ్రీనివాసులు రెడ్డి, పి.సుధాకర్, రామచంద్రారెడ్డి, మధుసూధనరావు పాల్గొన్నారు.

## ప్రకాశం జయంతి ఇక పండుగే

**- బ్రాహ్మణ సేవా సంఘం**

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులుగారి జయంతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించి జయంతి నిర్వహణకు ఏర్పాట్లు చేయడం పట్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షుడు వెల్లంచేటి చంద్రమౌళి అభినందనలు తెలిపారు. ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని రూ.500కోట్లతో బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయవలసినదిగా ఆయన చంద్రబాబును కోరారు. ఆగస్టు 23వ తేదీన టంగుటూరి ప్రకాశం పంతులు 142వ జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని బ్రాహ్మణ సంఘాలు ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయవలసినదిగా కోరారు.

## శ్రీ రంగనాయకులస్వామి ఆలయం ఇఓగా వేగూరు

నెల్లూరులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ రంగనాయకులస్వామి ఆలయం కార్యనిర్వహణాధికారిగా దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్‌గా పనిచేస్తున్న వేగూరు రవీంద్రరెడ్డిని నియమిస్తూ ఆ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల ప్రభుత్వం ఆలయాల పాలకమండళ్ళను రద్దు చేయడంతో ఆలయం స్థాయిని బట్టి వాటి నిర్వహణ బాధ్యతలను ఇ.ఓలకు అప్పగించిన నేపథ్యంలో, సహాయకమిషనర్‌గా వున్న వేగూరు రవీంద్రరెడ్డికి శ్రీ రంగనాయకులస్వామి ఆలయం బాధ్యతలను అప్పగించినట్లు తెలుస్తోంది.

## నాయకులొస్తున్నారు





కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు మరియు పట్టణాభివృద్ధిశాఖ మంత్రి యం.వెంకయ్యనాయుడు ఈ నెల 23, 24తేదీలలో జిల్లాలో పర్యటించనున్నారు. కాగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా ఈ నెల 24వతేదీ వెంకయ్య నాయుడుతో కలిసి పలు కార్యక్రమాలలో పాల్గొనబోతున్నారు. 23వ తేదీ ఉదయం వెంకయ్యనాయుడు ఉదయగిరిలో ఏర్పాటు చేసే కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం వెంకటాచలంలోని అక్షర స్కూల్ వార్షికోత్సవంలో పాల్గొంటారు. 24వ తేదీ వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో జరిగే వార్షికోత్సవం వేడుకల్లో వెంకయ్య నాయుడుతో పాటు చంద్రబాబు కూడా పాల్గొంటారు. ఆరోజు ట్రస్ట్ మరియు టీటీడీ సంయుక్త ఆధ్వర్యంలో అద్భుత శాంతియాగం నిర్వహిస్తారు. 12గంటలకు పూర్ణాహుతి జరుగుతుంది. 12-15గంటల నుండి 2గంటల వరకు స్వర్ణ భారత్ ట్రస్ట్ వేడుకలు జరుగుతాయి. వీటిని చూసుకుని వెంకయ్య నాయుడు, చంద్రబాబులు తిరుగుపయనమవుతారు. వీరిద్దరి పర్యటనకు సంబంధించి అధికారికంగా వివరాలు రావాల్సివుంది.

### వాకర్స్ ఆధ్వర్యంలో...

## కిడ్నీ వ్యాధులపై అవగాహన సదస్సు




నెల్లూరు దర్గామిట్టలోని ఏ.సి. స్టేడియంలో రెయిన్‌బో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సౌజన్యంతో కిడ్నీ వ్యాధులపై అవగాహన కార్యక్రమం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో డిఆర్‌పి నిశ్చల ప్రసాద్ రెడ్డి (యూరాలజిస్ట్), డా॥కె.ఆనందబాబు (నెఫ్రాలజిస్టు)లు మూత్రపిండ వ్యాధుల గురించి వివరించారు. ఈ సందర్భంగా రెయిన్‌బో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారు ఏ.సి.స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు ఉచితంగా హెల్త్‌కార్డులు పంపిణీ చేసారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ వి.రంగారావు, కార్యదర్శి బి.శేషగిరిరావు, ట్రెజరర్ నారాయణరావు, డా॥.శ్రీనివాసకుమార్, డా॥సత్యనాథ్, డా॥అంకిరెడ్డి, డా॥ఎం.ఎస్.రెడ్డి, డా॥నాగేశ్వరరావు, బి.సుందరరామిరెడ్డి, నిర్మలనరసింహారెడ్డి, ఎం.సి.క్రిష్ణయ్య, కె.విజయభాస్కర్‌రెడ్డి, కె.తిరుపతినాయుడు, ఎన్.సి.వి.ప్రసాద్, కె.ఎం.రెడ్డి, షణ్ముగం, టి.శ్రీనివాసులు, కె.రమేష్, తదితర సభ్యులు పాల్గొన్నారు.

## 50శాతం రాయితీతో "స్మైల్" దంత చికిత్సలు



అంతర్జాతీయ యువజన దినోత్సవం ఆగస్ట్ 12ని పురస్కరించుకొని "స్మైల్" సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాలలో యువతీ, యువకులకు 50శాతం రాయితీతో దంత చికిత్సలు నిర్వహించారు. నెల్లూరు నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొన్నారు. 100మంది తమ పేర్లు నమోదు చేసుకొన్నారు. ఈ రోజు పేర్లు నమోదు చేసుకొన్న వారికందరికి కన్సల్టెన్సీ మరియు స్కేలింగ్ పూర్తి ఉచితంగా నిర్వహించారు. ఈ చికిత్సలు "స్మైల్" సూపర్‌స్పెషాలిటీ దంత వైద్యశాల కాస్మోటిక్ డెంటల్ సర్జన్ టి.మానస ఆధ్వర్యంలో జరిగాయి. కార్యక్రమంలో స్మైల్ డెంటల్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ముక్కాల ద్వారకానాథ్‌కు ఘనసన్మానం



నెల్లూరు డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్‌ను ఈ నెల 9న స్థానిక ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అసోసియేషన్‌వారు ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దర్శి సురేష్‌బాబు, నాగేశ్వరరావు, కోశాధికారి మంజులూరు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు తిరివీధి రాఘవ, బయ్యా ప్రసాద్ తదితరులు పాల్గొని ద్వారకానాథ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బులియన్ మర్చంట్స్ అసోసియేషన్‌వారితో పాటు, స్థానిక వైఎస్సార్సీపి నాయకులు కూడా పాల్గొని నగర డిప్యూటీ మేయర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ముక్కాల ద్వారకనాథ్‌కు తమ అభినందనలు తెలియజేశారు.

## లెక్చరర్స్ కాలనీలో చోరీ

నెల్లూరులో దొంగతనాల జోరు పెరిగిపోతోంది. ఈ నెల 9వ తేది రాత్రి స్థానిక మాగుంట లేఅవుట్‌లోని లెక్చరర్స్ కాలనీలో తిరుపతి వెంకటరమేష్ అనే వ్యక్తి ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తులెవరో జొరబడి దేవుడి గదిలో వున్న 3 కేజీల వెండి, మరో 50 గ్రాముల బంగారాన్ని అపహరించుకుపోయారు. ఆ మేరకు బాధితుల ఫిర్యాదుతో నాల్గవ నగర సిఐ రామారావు చోరీ జరిగిన తీరును పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన

నెల్లూరులోని మూలాపేటలో వున్న రాజీవ్ గృహకల్ప సముదాయం ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన శ్రీ కార్యసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ఈ నెల 11న స్వామివారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఆలయ అర్చకులు, వేదపండితులు ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, వేద పండితులు ఈపూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## డిఎస్పీల నియామకం

జిల్లా ఏఆర్ డిఎస్పీగా చెంచురెడ్డిని నియమించారు. ప్రస్తుతం ఆయన విఆర్‌లో ఉన్నారు. ఇటీవల కాలం వరకు ఆర్టీసీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగాల డిఎస్పీగా పనిచేసారు. అలాగే హోం గార్డ్స్ డిఎస్పీగా శ్రీనివాసరావును నియమించారు. ఇటీవల కాలం వరకు ఈయన డిటిసి డిఎస్పీగా పనిచేస్తూ విఆర్‌లో వున్నారు.

## వైద్యకళాశాల పనులు వేగవంతం

### క్యాజువాలిటీ ఏర్పాటుకు ముమ్మరంగా పనులు

నెల్లూరు డిఎస్ఆర్ ఆసుపత్రిలో ఇటీవల ఏర్పాటుచేసిన ఏసి సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్యకళాశాలలో రెండో దశ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ కళాశాలను డిఎస్ఆర్ ఆసుపత్రికి అనుసంధానం చేస్తూ ఇక్కడ క్యాజువాలిటీ ఏర్పాటుకు కూడా ముమ్మరంగా పనులు చేపట్టారు. ఆసుపత్రి ఆవరణంలో ఏర్పాటుచేసిన పలు విభాగాలను కూడా కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

### ఆత్మీయతానురాగాల మధ్య

## రక్షాబంధన్



రాఖీ పర్వదినం సందర్భంగా ఈ నెల 10న రక్షాబంధన్ వేడుకను జిల్లా ప్రజలు ఆనందంగా నిర్వహించుకున్నారు. అన్నా చెల్లెళ్ళ అనుబంధానికి ప్రతీక అయిన ఈ రక్షాబంధన్ వేడుకను పురస్కరించుకుని, అక్కా చెల్లెళ్లు సోదరుల చేతికి రాఖీలు కట్టి, సోదరుల ఆశీస్సులు అందుకున్నారు. అన్నా చెల్లెళ్ళ ఆత్మీయతానురాగాల మధ్య, తల్లిదండ్రులు, కుటుంబసభ్యులందరి ప్రేమాభిమానాల మధ్య ఈ పర్వదినాన్ని అందరూ ఎంతో కన్నుల పండువగా జరుపుకున్నారు.

## 'ఎబోలా'పై ఆందోళన వద్దు

ఎబోలా వ్యాధిపై జిల్లావాసులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ వ్యాధి చెన్నైలో ఒకరికి సోకిందనే వదంతులు నమ్మవద్దని, ఆ వ్యక్తికి ఎబోలా వ్యాధి సోకలేదని వైద్యపరీక్షల్లో నిర్ధారణ అయిందని, కనుక ఈ వ్యాధి పట్ల జిల్లా వాసులు ఆందోళన చెందనవసరం లేదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటీశ్వరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# నెల్లూరులోనే రాజధాని నిర్మించాలి

### --- నిపుణుల కమిటీకి పలువురు వక్తల విజ్ఞాపన ---




రాజధాని నిర్మాణానికి అవసరమైన అన్ని వనరులూ పుష్కలంగా వున్న నెల్లూరు ప్రాంతంలోనే రాజధాని నిర్మాణం చేపట్టాలని పలువురు వక్తలు ఇటీవల నెల్లూరుకు విచ్చేసిన రాజధాని నిర్మాణ నిపుణుల కమిటీకి వెల్లడించారు. నెల్లూరుకు చెందిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగఫలితంగానే రాష్ట్రావతరణ జరిగిందని, అత్యంత విశిష్టత కలిగిన నెల్లూరు ప్రాంతంలోనే నవ్యాంధ్ర రాజధానిని నిర్మించాలని వక్తలు కోరారు. రాజధాని ఏర్పాటు విషయమై అభిప్రాయాలు సేకరిస్తూ నిపుణుల కమిటీ ఈ నెల 9న నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో సమావేశం నిర్వహించింది.

ఈ సమావేశంలో నిపుణుల కమిటీ బృందంలో టికె రవీంద్రన్, ఆరోమర్ రవి, తేజ మల్లాది, డికె శివకుమార్, పి.తిమ్మారెడ్డి తదితరులు విచ్చేశారు. జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్‌తో పాటు పలువురు జిల్లా అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లాకు చెందిన ప్రముఖులు, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి కెవి చలమయ్య మాట్లాడుతూ నెల్లూరుకు చెందిన శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగఫలితంగా రాష్ట్రం ఏర్పడిందని, నెల్లూరులో రాజధాని నిర్మించడం సముచితమని అన్నారు. పెన్నా డెల్టా ఆయకట్టు రైతుల సంఘం అధ్యక్షులు బెజవాడ గోవిందరెడ్డి, ఎన్జీఓ మాజీ నేత రవీంద్రబాబు తదితరులు మాట్లాడుతూ, రాజధాని ఏర్పాటుకు నెల్లూరులో అన్ని వనరులు పుష్కలంగా వున్నాయని వివరించారు. ఆ మేరకు ఆ వివరాల నివేదికలు కూడా కమిటీవారికి సమర్పించారు. అయితే, ఈ సమావేశంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులెవరూ పాల్గొనకపోవడం విమర్శలకు దారితీసింది. సమావేశానికి వచ్చిన వక్తలు, ప్రముఖుల నుంచి వచ్చిన అభిప్రాయాలను కమిటీ ఆలకించింది. వారి నుంచి, అధికారుల నుంచీ వచ్చిన విజ్ఞాపనలను స్వీకరించింది.

## శ్రీసిటీని సందర్శించిన రాజధాని కమిటీ



దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందన్న పేరున్న తడ సమీపంలోని శ్రీసిటీ సెజ్‌ను ఈ నెల 9వ తేదీ రాష్ట్ర రాజధాని ఎంపిక నిపుణుల కమిటీ సందర్శించింది. చెన్నై నుండి నెల్లూరుకు రోడ్డు మార్గాన వస్తూ వీళ్ళు శ్రీసిటీలోకి వెళ్ళారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవిసన్నారెడ్డి వారికి స్వాగతం పలికారు. శ్రీసిటీలో పరిశ్రమలను చూసారు. బిజినెస్ సెంటర్‌లో కొద్దిసేపు సేదతీరి అనంతరం నెల్లూరుకు బయల్దేరారు.

**పోర్టులో కమిటీ...** రాజధాని కమిటీసభ్యులు ఈ నెల 9న కృష్ణపట్నం పోర్టును సందర్శించారు. పోర్టు గార్డ్ నుండి గౌరవ వందనం స్వీకరించారు. పోర్టు కార్యాలయంలో ఏర్పాటుచేసిన పోర్టు అభివృద్ధి వీడియో చిత్రాల ప్రదర్శనను తెలుసుకున్నారు. ఇప్పటికే ఉన్న పరిశ్రమలు, కొత్తగా రాబోయే పరిశ్రమ గురించి తెలుసుకున్నారు. కమిటీసభ్యులు కె.టి.రవీంద్రన్, ఆరోమర్ రవిలతో పాటు నెల్లూరు ఆర్డీఓ సుబ్రహ్మణ్యేశ్వర రెడ్డి, తహశీల్దార్ కె.చెన్నయ్య, పోర్ట్ పిఆర్ఓ వేణుగోపాల్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు



నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 12న ఏపియుడబ్ల్యుజె ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ.జయప్రకాష్, జిల్లా కన్వీనర్ యం.చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ 1957 ఆగష్టు 15న ఏర్పడిన ఏపియుడబ్ల్యుజె వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈనెల 17న సీనియర్ పాత్రికేయులను సత్కరిస్తామని తెలిపారు. ఏపియుడబ్ల్యుజె పోరాట ఫలితంగా రాష్ట్ర ఉద్యోగులతో పాటు జర్నలిస్టులకు హెల్త్‌కార్డులను అందించనున్న రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జర్నలిస్టులకు సంక్షేమ పథకాన్ని రూపొందిస్తున్నట్లు కేంద్ర సమాచారశాఖమంత్రి ప్రకాష్ జావేద్కర్ తెలిపారని, మరణించిన జర్నలిస్టులకు, అనారోగ్యంతో బాధపడుతున్న జర్నలిస్టులకు ఈ పథకం వల్ల తక్షణ ఆర్థిక సహాయం అందుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర మున్సిపల్, పట్టణశాఖ మంత్రి డా॥ పి.నారాయణ ఆదేశాల మేరకు నెల్లూరు మున్సిపల్ కమీషనర్ జాన్‌శ్యాంసన్ కొత్తూరు ప్రాంతంలోని జర్నలిస్టుల కాలనీని పరిశీలించి కాలనీకి అవసరమైన రోడ్లు, డ్రైనేజీ ఇతర మౌలిక అవసరాలపై నివేదిక సమర్పిస్తారని తెలిపారు.

ఈ సమావేశంలో అడ్‌హాక్ కమిటీ సభ్యులు బి.రాజన్, జి.వినోద్, వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# బాబును సీఎం చేయాలన్న లక్ష్యంతో పనిచేశాం

### - విలేకర్ల సమావేశంలో సోమిరెడ్డి, బీద





చంద్రబాబును ముఖ్యమంత్రిగా చూడాలన్న లక్ష్యంతోనే మాతో పాటూ ప్రతి కార్యకర్త శ్రమించాడని, వారి శ్రమను వృధా పోనివ్వమని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా ప్రతిపక్షంలో వుండి పోరాటాలు చేసిన కార్యకర్తలకు న్యాయం జరగాలన్నదే తమ ఉద్దేశ్యమన్నారు. ఈ పదేళ్ళ పార్టీ కోసం ఆస్తులు పోగొట్టుకున్న వాళ్ళున్నారు, అక్రమకేసులు అనుభవిస్తున్నవాళ్ళున్నారు. ఇలాంటి వారిని గుర్తించి గౌరవించాల్సిన అవసరముందని ఆయన పేర్కొన్నారు. పార్టీలో ఎలాంటి విభేదాలు లేవని, అందరూ రాష్ట్రాభివృద్ధి కోసం ఒక టీమ్‌గా పనిచేస్తున్నామన్నారు. పార్టీని పటిష్టం చేయాలన్న లక్ష్యంతో ఎన్నికలకు ముందు ఎమ్మెల్యేలుగా వున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి - పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలను కూడా పార్టీలోకి ఆహ్వానించామన్నారు. ఆనం సోదరులతో పాటు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కూడా ఎన్నికలకు ముందే పార్టీలోకి ఆహ్వానించామన్నారు. జిల్లా అభివృద్ధికి కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు, రాష్ట్ర మున్సిపల్ మంత్రి పి.నారాయణల సహకారంతో పనిచేస్తానన్నారు. సర్వేపల్లి నియోజకవర్గ కార్యకర్తలకు అందుబాటులో ఉండేందుకు నెల్లూరు ఆదిత్యనగర్‌లో కార్యాలయం ప్రారంభించామని, ఇంతకు ముందు మాగుంట లేఅవుట్‌లో వున్న కార్యాలయాన్ని ఇక్కడకు మార్చడం జరిగిందన్నారు. దీనికి వక్రభాష్యం చెప్పాల్సిన అవసరం లేదన్నారు.

పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర మాట్లాడుతూ మేయర్ అజీజ్ తెలుగుదేశంపార్టీలో చేరే విషయంలో కొంత సమాచార లోపం ఉన్నమాట వాస్తవమేనన్నారు. వైకాపాలో తలెత్తిన విభేదాలతో మేయర్ తెలుగుదేశంలో అనూహ్యంగా చేరాడని, ఈ సమయంలో కొంత సమాచార లోపం ఏర్పడిందన్నారు. 1991 నుండి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి నెల్లూరులో సొంత కార్యాలయం ఉందని, దీనిపై రాద్ధాంతం అవసరం లేదన్నారు. అర్హులైన కార్యకర్తలకు త్వరలో నామినేటెడ్ పదవులుంటాయన్నారు.

ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అనూరాధ, అధికార ప్రతినిధి డాక్టర్ జడ్.శివప్రసాద్, నూనె మల్లిఖార్జున యాదవ్, కిలారి వెంకట స్వామినాయుడు, ధర్మవరం సుబ్బారావు, మందవ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైకాపాను వీడేది లేదు

### జడ్పీ చైర్మెన్ స్పష్టీకరణ



తాను పార్టీ మారే ప్రసక్తే లేదని, వైకాపాను వీడేది లేదని జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి స్పష్టం చేశారు. ఈ నెల 11న ఆయన నగరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, తాను పార్టీ మారుతానంటూ మాజీ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి తనపై లేనిపోని దుష్ప్రచారం చేస్తున్నారని, తనపై కొందరు పనిగట్టుకుని మరీ ఇలాంటి అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. అసలు ఆనం వివేకా ఏ పార్టీలో వున్నారో, ఏ పార్టీలో చేరబోతున్నారో చెప్పాలని ఆయన అంటూ, పార్టీ మారేందుకు ఇతర పార్టీలవారితో మంతనాలు చేస్తున్న వివేకానందరెడ్డి, తనపై అసత్య ప్రచారాలు చేస్తుండడం సముచితం కాదన్నారు. జడ్పీ ఎన్నికల సందర్భంలో తమ సభ్యులను తెలుగుదేశం పార్టీవారు ఎన్నో ప్రలోభాలకు గురిచేశారని, అయితే ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా తనకు మద్దతు తెలిపిన జడ్పీటిసి సభ్యులను, తమ పార్టీ శాసనసభ్యులను వీడేది లేదని, తాను పార్టీనుంచి మారే ప్రసక్తే లేదని బొమ్మిరెడ్డి స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో బొమ్మిరెడ్డితో పాటు, మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి 'వారధి'

### - జిల్లా ఎస్పీ సెంథిల్‌కుమార్



పోలీసుశాఖలో పనిచేసే సిబ్బంది సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు జిల్లా ఎస్పీ సెంథిల్ కుమార్ పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారు. సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం నూతనంగా 'వారధి' అనే పేరుతో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేశారు. ఈ నెల 11న నగరంలోని పోలీసు కవాతు మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పాల్గొని మాట్లాడుతూ, సిబ్బంది తమ సమస్యల పరిష్కారం కోసం ఎస్పీ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా, ఎప్పటికప్పుడు వారి సమస్యలు తీర్చేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. మారుమూల ప్రాంతాల్లోని పోలీసు సిబ్బంది వారి సమస్యల పరిష్కారం కోసం ఇక్కడిదాకా రావాల్సిన అవసరం లేదని, ఒక్క ఎస్ఎంఎస్ ఇస్తే చాలని, ఆ సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ప్రత్యేక సెల్‌కు 'వారధి'అని పేరు పెట్టామన్నారు. అదనపు ఎస్పీ రెడ్డి గంగాధరరావు పర్యవేక్షణలో ఈ ప్రత్యేక సెల్ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా, తొలుత ఎస్పీ ఎఆర్ సిబ్బంది గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్పీ రెడ్డి గంగాధరరావు, ఎఆర్, హోంగార్డ్ డిఎస్పీలు చెంచురెడ్డి, కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ గుడి అభివృద్ధికి కృషిచేస్తా

### - కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని వెంగళరావునగర్‌లో ఉన్న ముత్యాలమ్మ గుడిలో జరుగుతున్న జాతరలో ఈనెల 10న నెల్లూరు రూరల్ ఎం.ఎల్.ఏ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడి వైభవాలు, భక్తుల విన్యాసాలను భక్తిపారవశ్యంతో తిలకించారు. అనంతరం ముత్యాలమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, వెంగళరావు నగర్‌లో జరిగిన ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ వెంగళరావు నగర్‌లో వెలిసి వున్న ముత్యాలమ్మ తల్లి అత్యంత శక్తి కలిగిన మహాతల్లి అని, భక్తి శ్రద్ధలతో ముత్యాలమ్మ తల్లిని ప్రార్థిస్తే ఆ కార్యం తప్పక నెరవేరుతుందని అన్నారు. 48సం॥లుగా అమ్మవారి గుడి ఉందని ప్రతి సంవత్సరం ముత్యాలమ్మ జాతర అత్యంత వైభవంగా జరుగుతుందని, భక్తిశ్రద్ధలతో భక్తులు అమ్మవారిని కోర్కెలు కోరి మొక్కులు చెల్లించుకుంటారని, ముత్యాలమ్మ గుడిని మరింతగా అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషిచేస్తానని అన్నారు.

కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రశాంత్ కిరణ్, బొబ్బల శ్రీనివాసయాదవ్, డా॥సత్తార్, పర్వతాల శ్రీనివాసులగౌడ్, హాజరత్‌నాయుడు, మల్లిఖార్జునగౌడ్, శ్రీనివాసులరెడ్డి, నాగా ప్రభాకర్‌రెడ్డి, రమణారెడ్డి, కొండారెడ్డి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీను గల్పిక

# కేసీఆర్‌ను ఆవహించిన నిజాంనవాబు

అది 1951ప్రాంతం. బ్రిటీషోడు దేశానికి స్వాతంత్ర్యం ఇచ్చిపోయాడు. కాని దేశంలో ఆయా సంస్థానాలు అలాగే స్వతంత్రంగా ఉండిపోయాయి. తన శక్తిసామర్థ్యాల మీద అంతగా గురి కుదరని ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వాటిని విలీనం చేసే బాధ్యతను ఉక్కు మనిషి, ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్‌పటేల్‌కు అప్పగించారు. హైదరాబాద్ సంస్థానాన్ని నిజాంనవాబు పరిపాలిస్తున్నాడు. భారత దేశంలో విలీనం కావడం నిజాంకు ఇష్టం లేదు. పాకిస్థాన్‌తోనన్నా కలవాలి, లేదా సొంత దేశంగానన్నా ఉండాలని ఆయన కోరిక. పటేల్ మంచిగా చెప్పి చూసాడు. కాని నిజాం వింటేనా... విలీనమయ్యే సమస్యే లేదన్నాడు. దాంతో పటేల్ సైన్యాన్ని పంపించాడు. హైదరాబాద్ సైన్యం వారితో పోరాడలేక చేతులెత్తేసింది. నిజాం కూడా సంధికి దిగొచ్చాడు. అలా భారత్‌లో హైదరాబాద్ విలీనం జరిగిపోయింది. హైదరాబాద్ సంస్థానాన్ని కోల్పోయాననే బాధతో నిజాం మంచంపట్టాడు. జీవిత తుదిమాంకంలో ఉన్నప్పుడు నా సంస్థానాన్ని కాజేస్తారా? నాకు రాజ్యం లేకుండా చేస్తారా? మిమ్మల్ని క్షమించను. నా ఆశలను నెరవేర్చేవాళ్లు ఎవరో ఒకరు ఈ భూమ్మీద పుట్టకుండా పోరు... వారి చేత మీకు నరకం చూపించకుండా వదిలేది లేదు... ఇదే నా శాపం అంటూ తనువు చాలించాడు.

★★★★★

సరిగ్గా 64ఏళ్ల తర్వాత ఆంధ్రప్రదేశ్ విడిపోయింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారు. ఆ తర్వాత...

★★★★★

అది హైదరాబాద్‌లోని తెలంగాణ సీఎం కేసీఆర్ ఛాంబర్. కేసీఆర్ గదిలో కూర్చుని ఉన్నాడు. అంతలో మంత్రులు హరీష్‌రావు, ఈటెల రాజేందర్, మహేందర్‌రెడ్డి, కేటీఆర్, నాయని నర్సింహారెడ్డిలు వచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు గురించి వాళ్లు చర్చిస్తున్నారు. కేసీఆర్ వుండి... ఈసారి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను గోల్కొండకోట మీద పెడదాం. అక్కడే జెండా వందనం కూడా చేద్దాం, నిజాం నవాబు గారి నిలువెత్తు విగ్రహం అక్కడ పెట్టండ్రి, మూడురంగుల జెండా బదులు నిజాం పాలనలో వున్న జెండాను ఎగురవేయాలి, పిల్లలు ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాలన్నీ నిజాం నవాబు గొప్పతనాన్ని చాటేటట్లు ఉండాలి. పిల్లలకు 'నిజాం నవాబు పరిపాలనా వైభవం' పై వ్యాసరచన పోటీలు, 'నిజాం పాలన – స్వర్ణయుగం'పై వక్తృత్వ పోటీలు నిర్వహించాలి. నిజాం పాలనపై హరికథ, బుర్రకథలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేయండని చెప్పాడు. నాయని నరసింహారెడ్డి ఆశ్చర్యంగా... అదేంటి సార్, మనం నిజాం నవాబును పొగడడమేమిటి... ఏమన్నా పొగిడితే నెహ్రూనో, పటేల్‌నో పొగడాలి గాని అన్నాడు. పటేల్ మాట వినపడగానే కేసీఆర్ కళ్లెర్రజేశాడు. ఆగ్రహంతో... నోర్ముయ్, ఆ పేరును ఇంకోసారి పలికావో నీ నాలుక కోస్తా అంటూ వూగిపోయాడు. ఆ పరిణామానికి మిగతా మంత్రులు బిత్తరపోయారు. మామకు పటేల్‌కు ఎటువంటి శత్రుత్వం లేదే... మరి ఈయన ఎందుకబ్బా పటేల్ పేరు వింటే అంతగా మండిపడుతున్నాడంటూ హరీష్‌రావు కూడా ఆశ్చర్యంలో మునిగిపోయాడు. కేటీఆర్ పరిస్థితి అయితే అర్థం కాని విధంగా వుంది. అంతలో అక్కడకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులొచ్చారు. వాళ్లతో కేసీఆర్... హైదరాబాద్ అంతా గాలించండి. ఎక్కడ ఆంధ్రావాళ్ళ ఇళ్లున్నా వదలొద్దు, అక్రమమైనా, సక్రమమైనా ముందు కూలగొట్టండి, నా కొడుకులు... వాళ్లు అవస్థలు పడుతుంటే నా మనసు ఆనందించాలి. ఆ ఆంధ్రావోళ్ల పిల్లలకు రూపాయి కూడా ఫీజు రీయంబర్స్‌మెంట్ ఇవ్వొద్దు. 1951కి ముందు నాతో పాటు ఎవరున్నారో వాళ్లే ఇక్కడి వాళ్లు, అని అన్నాడు. అతని మాటలు హరీష్‌రావు, కేటీఆర్‌లను ఆలోచనలో పడేసాయి. 1951నాటికి కేసీఆర్ అప్పుడే పుట్టివుంటాడు. మరి అప్పుడు పుట్టినవాళ్ల గురించి ఈయన ఇప్పుడు ఎందుకు ఆలోచిస్తున్నాడని వీరు ఆలోచనలో పడ్డారు.

అప్పుడే తెలుగుదేశం నాయకులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, రేవంత్‌రెడ్డి, బీజేపీ నాయకులు బండారు దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి, నాగం జనార్ధన్‌రెడ్డిలు వచ్చారు. కిషన్‌రెడ్డి వుండి... అదేంటి సీఎం గారు... హైదరాబాద్ తెలంగాణ, ఏపిలకు ఉమ్మడి రాజధాని, ఇక్కడ శాంతిభద్రతల అధికారాలు పదేళ్ల పాటు గవర్నర్ పరిధిలోనే ఉంటాయని విభజన బిల్లులోనే స్పష్టంగా చెప్పారు. ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోడీ కొత్తగా చేసిందేమీ లేదు. బిల్లులో పేర్కొన్నట్లే రాజధానిపై గవర్నర్‌కు విశేషాధికారాలు అప్పగిస్తున్నారు. దీనికి మీరు ప్రధానిని తప్పుపడితే ఎలా? అని ప్రశ్నించాడు. ఆ మాటలతో కేసీఆర్‌కు తిక్కరేగింది. పొండయ్యా, పెద్ద మనుషుల్లాగా చెప్పుకొచ్చారు... అసలు నా రాజ్యంలో ఇంకొకడి పెత్తనమేమిటి, అసలు నా రాజ్యాన్ని ఈ దేశంలో విలీనం చేయమన్నదెవరు? అంటూ కోప్పడసాగాడు. కేసీఆర్ మాటలు వారికేం అర్థం కాలేదు. బండారు దత్తాత్రేయ వుండి... మహానుభావుడు సర్దార్‌పటేల్ పుణ్యమా అని హైదరాబాద్ సంస్థానం దేశంలో విలీనమైంది... లేదంటే మనం దరివి బానిసబ్రతుకులే... మనమంతా ఆ పటేల్ గారి ఋణం తీర్చుకోవాలి. కాబట్టి మన ప్రభుత్వం తరపున కూడా గుజరాత్‌లో నిర్మించే ఆయన విగ్రహానికి కొంత విరాళం పంపుదామని ప్రతిపాదించాడు. ఆ మాట పూర్తయ్యిందో లేదో... దత్తాత్రేయ మీదకు దూసుకుపోయాడు కేసీఆర్. పటేల్ నీకు మహానుభావుడా... నేను దుర్మార్గుడినా... ఆ పటేల్ అంతుచూస్తాను, నాకు ఆత్మశాంతి లేకుండా చేసిన పటేల్ మనషులెవరికీ ప్రశాంతత లేకుండా చేస్తాను అంటూ దత్తాత్రేయ చొక్కా పట్టుకుని అరుస్తూ స్పృహతప్పి పడిపోయాడు. కేటీఆర్, హరీష్‌లు కేసీఆర్‌ను పైకిలేపే ప్రయత్నం చేస్తుండగా, నాగం వుండి... నాన్నగారు ఇంకా తాగుతున్నారా అని అడిగాడు. లేదు అంకుల్, తాగడం మానేసారు. అప్పటి నుండే పడిపోతున్నారని కేటీఆర్ చెప్పాడు. కిషన్‌రెడ్డి అందుకుని... మీ నాన్నలో ఈ పోకడలేంటి... విచిత్రంగా ప్రవర్తిస్తున్నాడేంటి... నిజాంకు అంతగా భజన చేస్తున్నాడేంటి? అని అడిగాడు. నాకు తెలియదు అంకుల్, ఏమైందో కనుక్కుని మీకు రేపు చెబుతాను అని చెప్పి కేసీఆర్‌ను కారులో వేసుకుని కేటీఆర్ ఇంటికిపోయారు.

★★★★★

అది గోల్కొండకోట ప్రాంతం. దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, నాగం, ఎర్రబెల్లి అక్కడకు చేరుకున్నారు. హరీష్‌రావు, కేటీఆర్‌లు వారిని నిజాం సమాధి వద్దకు తీసుకెళ్లారు. మమ్మల్ని ఇక్కడికెందుకు తీసుకొచ్చారని వీళ్లడిగారు. దానికి కేటీఆర్... మీరు మా నాన్నను అపార్థం చేసుకున్నారు. మా తండ్రి నిజాంకు భక్తుడనేగా మీ అనుమానం. కాని అది వాస్తవం కాదు, మా తండ్రిని నిజాం నవాబు ఆవహిస్తున్నాడు. కాబట్టే మా నాయన నిజాం నవాబు అభిమానిలా వ్యవహరిస్తున్నాడు. అదెలా జరిగిందంటే... మా తండ్రి సీఎం అయ్యాక నేరుగా ఇదిగో ఈ నిజాం సమాధి వద్దకు వచ్చాడు. ఎంతైనా నిజాం అంటే మా తండ్రికి కొంత భక్తి వుంది. మా తండ్రిని చూడగానే నిజాం ఆత్మ లేచి కూర్చుంది. ఈ దేశం మీద తన కసి తీర్చుకునే సమయం ఆసన్నమైందని నిజాం ఆత్మ మా తండ్రిలో ప్రవేశించింది. అలా నిజాం నవాబే మా నాయన చేత ఈ పనులన్నీ చేయిస్తున్నాడని కేటీఆర్ చెప్పాడు. ఆ స్టోరీ వింటుంటే వీరికి చంద్రముఖి–2 సినిమా చూస్తున్నట్లనిపించింది. అంతలో నిజాం సమాధి వద్ద అలికిడి వినిపించింది. సమాధి ముందు కేసీఆర్ పూలు చల్లుతూ... మీ ఆశయాన్ని కొనసాగిస్తానని పిడికిలి బిగించి నినాదం చేయసాగాడు. అది చూసి నాయకులంతా... నిజాం మళ్ళీ పుట్టాడురా బాబు అంటూ కేకలు పెట్టారు.

కదంబం

## సృష్టి

– డా॥ ఎన్.గోపి
హైదరాబాద్. 9391028496

కవి అలసిపోవచ్చు
కవిత అలసిపోదు
కవికి వృద్ధాప్యం రావచ్చు
పద్యానికి యౌవనం పోదు

వొణుకుతున్న
కవి చేతివైపు సైతం
ఆశగా చూస్తాయి అక్షరాలు
అతని కాళ్ళు తడబడవచ్చు
పద్యపాదాల పరుగు మాత్రం ఆగదు.

కళ్ళకు మసకలొస్తే రావచ్చు
కలలకు రెక్క వాలదు
కవి వాక్యాలు వెంటాడుతాయి
అమానవీయతను చెండాడుతాయి
అనుభవ నేత్రానికి
అవధుల ప్రసక్తి వుండదు.


రోగ పీడిత సుదీర్ఘరాత్రులు
ఉదయ పుష్పం కోసం ఎదురుచూస్తాయి
కన్నీటి సరోవరాలకు
కొత్త కాలువలేర్పడుతాయి.
ఇక పద్యాలు
వింత వింత రంగుల్లో విప్పారుతాయి

కవి గమ్యం
మృత్యువు కాదు
జీవనగ్రంథంలో
మరో పుట.

## 20న 'వెన్నెల జలపాతం' పుస్తకావిష్కరణ


వర్థమానకవి గుండాల నరేంద్రబాబు రచించిన 'వెన్నెల జలపాతం' కవితా సంపుటిని ఆగస్టు 20న సాయంత్రం 5గంటలకు జూనియర్ రేబాల లక్ష్మీ నరసారెడ్డి స్మారక పురమందిరంలో ఆవిష్కరించనున్నట్లు పెన్నా రచయితల సంఘం అధ్యక్షులు ఎస్.కె.షంషుద్దీన్ తెలిపారు. అదేరోజు కవితల పోటీ నిర్వహిస్తామని కవులు ఏ అంశం మీదనైనా కవితలు చదవవచ్చని, ఉత్తమంగా ఎన్నికైన పది కవితలకు బహుమతులుంటాయని, కవులు, సాహిత్య అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా ఆయన కోరారు. వివరాలకు 9441598547 నెంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

## ఆలయాలను సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి



హైకోర్టు న్యాయమూర్తి డి. శివశంకర్ ఈ నెల 9న జిల్లాకు విచ్చేసి పలు ఆలయాలను సందర్శించి, పూజలు చేశారు. తొలుత ఆయన గొలగమూడిలోని భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆలయాన్ని దర్శించుకుని, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నెల్లూరులోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మెన్ రత్నం జయరామ్, ఆలయ ప్రధాన అర్చకులు తంగిరాల రాధాకృష్ణశర్మ తదితరులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆ తర్వాత రంగనాయకులపేటలో వెలసివున్న ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ రంగనాథ స్వామివారి ఆలయాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆయన వెంట జిల్లాకు చెందిన పలువురు న్యాయమూర్తులు, డిఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి, అట్రాసిటీ కమిటీ సభ్యుడు తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## 18 నుంచి వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు



నెల్లూరు సమీపంలోని, వెంకటాచలం మండలం గొలగమూడిలో వెలసివున్న భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆలయంలో ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు స్వామివారి 32వ ఆరాధనా మహోత్సవాలు వైభవోపేతంగా జరుగనున్నాయి. 18వ తేది ఉదయం నిత్యపూజల అనంతరం ఈ ఆరాధనా మహోత్సవాలకు అంకురార్పణ చేస్తారు. ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం, రాత్రి వాహనసేవలు ఘనంగా నిర్వహిస్తారు. 18వ తేది ఉదయం 10 గంటలకు స్వామివారికి సర్వభూపాల వాహన సేవ, రాత్రి 9 గంటలకు కల్పవృక్ష వాహనసేవ నిర్వహిస్తారు. అదేవిధంగా, 19న ఉదయం హనుమంత వాహనసేవ, రాత్రికి చంద్రప్రభ వాహనసేవ, 20న ఉదయం చిన్నశేషవాహన సేవ, రాత్రికి హంసవాహనసేవ, 21న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రికి గజవాహనం, 22న ఉదయం అశ్వవాహనసేవ, రాత్రికి పెద్ద శేషవాహన సేవ, 23న ఉదయం సింహ వాహనసేవ, రాత్రి 9 గంటలకు గరుడవాహన సేవ కన్నులపండువగా నిర్వహిస్తారు. 24వ తేదీన స్వామివారికి మరింత వైభవంగా ఆరాధన మహోత్సవం నిర్వహిస్తారు. ఆ రోజున ఉదయం 9 గంటలకు సర్వేపల్లి శాసనసభ్యులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఉదయం 10 గంటల నుంచి రథోత్సవం అంగరంగవైభవంగా వుంటుంది. అనంతరం రాత్రి 8 గంటలకు తెప్ప మహోత్సవం నిర్వహిస్తారు. భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమం వారి ఆధ్వర్యంలో ఈ ఏడు రోజులపాటు ప్రతి రోజూ ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటుచేశారు.

ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ప్రతిరోజూ టిటిడి దాస సాహిత్యపరిషత్‌వారిచే కోలాటం, భజన కార్యక్రమాలు, హిందూ ధర్మ ప్రచారపరిషత్ నెల్లూరుశాఖ వారిచే హరికథాగానం వుంటాయి. ఈ ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచే కాక, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి కూడా వేల సంఖ్యలో భక్తులు గొలగమూడికి తరలివస్తారు కనుక, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆశ్రమం వారు తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఉద్యోగులు జాగ్రత్తగా విధి నిర్వహణ జరపండి. అధికారులు మరియు పబ్లిక్‌తో సమస్యలుంటాయి. ఆరోగ్యం లోపం వలన ఇబ్బంది పడతారు. వృత్తి వ్యాపారాలలో వ్యాపకం ఆదాయం ఉండినా ఆదాయానికి మించిన ఖర్చులుంటాయి. కొత్త పెట్టుబడులకు, కొనుగోలుకు అప్పు చేయవలసి రావచ్చును. అనుకున్న పనులు సరిగా జరుపుకొనలేక టెన్షన్ పడుతుంటారు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

పలుకుబడితో పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తారు. ఉద్యోగులకు స్థానమార్పులు, అదనపు బాధ్యతలుంటాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. హడావుడిగ తొందరపాటు నిర్ణయాలు చేయవద్దు. మీ పథకాలు ప్రణాళిక త్వరలో మంచి ఫలితాలనిస్తాయి. అనుకోని ఖర్చులు పైనబడి అవసరాలకు ఋణాలు చేసే అవకాశమున్నది. ఆకర్షణలకు లోనుకావద్దు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఉద్యోగులకు బాధ్యతలు అదనంగా మోపబడగలవు. అనుకున్న పనులకు అవరోధాలుంటాయి. అందువల్ల టెన్షన్ పెరుగుతుంది. ఆత్మీయులకు బంధువులకు అనారోగ్య బాధలుంటాయి. ఉద్యోగులకు వ్యాపారులకు అధికారుల వల్ల సమస్యలుకాగలవు. వృత్తి వ్యాపారాల నిర్వహణ, రాబడి అసంతృప్తి కలిగిస్తుంది. మంచి ఆర్థికావకాశాలు వాయిదా పడవచ్చును.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

శుభకార్యముకై ముమ్మర ప్రయత్నాలుంటాయి. ఆరోగ్యం బాగుంటుంది. ఉద్యోగుల బాధ్యతలు పెరుగుతాయి. ఉద్యోగులకు స్థానమార్పు, ఉద్యోగార్థులకు అవకాశాలు దొరుకుతాయి. పెరిగిపోయిన ఖర్చులను అదుపు చేసుకొనడం, క్రొత్త ప్రణాళికలో వ్యాపార వృత్తులను జరుపుకొంటారు. ఆదాయం సామాన్యం. దూరప్రయాణాలుంటాయి. స్థిరాస్థుల లావాదేవీలు నిర్వహిస్తారు.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 15.8.2014 నుండి**
**తేది. 21.8.2014 వరకు**

ఈ వారము మీనమేషవృషభమిథున రాశులలో చంద్రుడు, కర్కాటకంలో రవి గురు శుక్రులు, 17వ తేది నుండి సింహరాశిలో రవి, సింహంలో బుధుడు, కన్యలో రాహువు మీనంలో కేతువు, తులలో కుజశనులు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 15 శుక్రవారము స్వాతంత్ర్య దినోత్సవము. తేది సోమవారము శ్రీకృష్ణాష్టమి.

**ముహూర్తములు:**

తేది 15 శుక్రవారము రాత్రి గం॥1.32 నుండి 3.38లోగా మిథునలగ్నములో వివాహము. తేది 20 బుధవారము ఉ॥గం॥3.30 నుండి 5.30లోగా కర్కాటకలగ్నమున గృహారంభ వివాహ గృహప్రవేశములు.

పిదప డిసెంబరు వరకు ముహూర్తములు లేవు.

**శ్రావణమాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 15 | శుక్ర | పంచమి | ప॥గం.1.30వ॥ |
| తేది. 16 | శని | షష్ఠి | ప॥గం.12.02వ॥ |
| తేది. 17 | ఆది | సప్తమి | ఉ॥గం.10.57వ॥ |
| తేది. 18 | సోమ | అష్టమి | ఉ॥గం.10.20వ॥ |
| తేది. 19 | మంగళ | నవమి | ఉ॥గం.10.14వ॥ |
| తేది. 20 | బుధ | దశమి | ఉ॥గం.10.38వ॥ |
| తేది. 21 | గురు | ఏకాదశి | ఉ॥గం.11.32వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ప్రభుత్వ అనుమతులు ఆలస్యంకాగలవు. రియల్ ఎస్టేట్, ట్రాన్స్‌పోర్ట్ రంగాల యజమానులకు అభివృద్ధి ఉంటుంది. వృత్తివ్యాపారాలు నిర్వహణ సంతృప్తిగా ఉంటుంది. ఆదాయం పెరుగుతుంది. కొత్త పెట్టుబడులకు, నూతన వ్యాపారాల ప్రారంభానికి ప్రయత్నాలు సాగిస్తారు. స్థిరాస్తుల విషయంలో తొందరపాటుగ నిర్ణయాలు చేయవద్దు.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాల మంజూరు లభిస్తుంది. అగ్రిమెంట్లు రాబట్టుకొనే బాకీల విషయంలో ఖచ్చితంగా ఉండండి. కళత్ర అనారోగ్యము, అధిక ఖర్చులు కారణముగ ఆలోచనలు పెరిగి టెన్షన్ పడతారు. అనుకున్న పనులకు ఆటంకాలుంటాయి. వృత్తి వ్యాపారాలలో ప్రాబల్యం పెరిగి ఆదాయం పెరుగుతుంది. లౌక్యంగా కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకొంటారు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

స్థిరాస్తులు కొనే ప్రయత్నాలు జరుగుతాయి. ఉద్యోగార్థులకు అవకాశాలు లభించగలవు. కుటుంబ సమస్యలుండే వారికి సర్దుబాటుకాగలవు. ఆదాయము ఖర్చు సమానంగా ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో వ్యాపకం పెరుగుతుంది. పనులకు ఆటంకాలు కలగుట వల్ల టెన్షన్‌పడుతారు. వాహనాలు నడిపేటప్పుడు, యంత్రాలు కరెంటు పనులు చేసేవారు మెలకువగా ఉండాలి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వ్యవహారాలలో ఆటంకాలు చికాకులుండి పనులు నిదానంగా జరుగుతుంటాయి. ఋణవత్తిడి పెరగవచ్చును. వ్యవసాయ వర్గాలవారికి పరిస్థితులు ఆశాజనకంగా ఉంటాయి. ఈ వారం మంచి ఖర్చు పైనబడవచ్చును. వృత్తి వ్యాపారాలలో స్తబ్ధత నెలకొంటుంది. ఆదాయ వ్యయాలలో తేడాలుంటాయి. ప్రభుత్వ అనుమతులు లభించగలవు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

కుటుంబసభ్యుల మధ్య అవగాహన కుదరక ఇబ్బంది పడతారు. అనుకున్న పనులను ఏకాగ్రతతో సాధించుకొంటారు. కుటుంబసభ్యులలో ఒకరిద్దరికి అనారోగ్య బాధలుండవచ్చును. ఆర్థిక ఒప్పందాలు, చెల్లింపులు, బ్యాంకు లావాదేవీలందు జాగ్రత్త అవసరం. వ్యాపారవృద్ధి అవకాశాలు దొరుకుతాయి. వృత్తి జీవనంలో అభివృద్ధి ఆదాయం బాగుంటుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఆత్మీయ బందువులను కలుసుకుంటారు. కుటుంబ సభ్యుల అనుకూలత ఇంట్లో తక్కువగా ఉంటుంది. దైవ కార్యక్రమాలు, వృత్తి పరమగు మీటింగులలో పాల్గొంటారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. స్థిరాస్తులు షేర్ల మీద ఆదాయం బాగుంటుంది. సోదరుల కుటుంబాలకు మేలు జరుగుతుంది. ఆఫీసులలో మీ పనులు అనుకూలం కాగలవు.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

స్థిరాస్తుల క్రయవిక్రయాలు వాయిదా వేసుకొనండి. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు దొరుకుతాయి. కోర్టు కేసులు, మధ్యవర్తిత్వాలలో వ్యవహారాలు దెబ్బతినకుండా జాగ్రత్తపడాలి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, ఆశించిన మేరకు ఆదాయం ఉంటుంది. శ్రమతో పనులు పూర్తి చేస్తారు. శుభకార్యాలు నిర్ణయమగు అవకాశాలుంటాయి. కుటుంబంలో మీ పనులకు కొంత వ్యతిరేకత ఉండినా లెక్కచేయరు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

పెండింగ్‌లోనున్న పనులు, ఆఫీసు ఫైళ్ళలో కదలిక ఉంటుంది. శుభకార్య నిర్ణయాలు జరుగగలవు. విద్యార్థులకు మంచి ఉన్నత విద్యావకాశాలు లభించగలవు. ఆర్థికంగా స్థిమిత పడతారు. కొత్త వ్యాపారాలు, కొత్త పెట్టుబడుల ప్రయత్నాలు సానుకూలంకాగలవు. బంధుమిత్రులను కలుసుకొంటారు. దూరప్రయాణాలుంటాయి. బంధుమిత్రుల సహాయసహకారాలు పనులలో లభిస్తుంది.

## శ్రోతలను ఉర్రూతలూగించిన

# 'యాదే రఫీ'


హిందీ చలనచిత్ర సీమలో తనదంటూ ప్రత్యేకమైన, అద్భుతమైన గానంతో దేశవ్యాప్తంగా విఖ్యాతి చెందిన ప్రసిద్ధ గాయకుడు మహమ్మద్ రఫీ వర్ధంతి కార్యక్రమాన్ని నెల్లూరులో ఈ నెల 9న నిర్వహించారు. 'నా మది నిన్ను పిలిచింది గానమై.. వేణుగానమై'.. అంటూ అశేష తెలుగుప్రజల హృదయాల్లో కూడా మధురగాయకునిగా ప్రత్యేక ముద్ర వేసుకున్న ప్రసిద్ధ గాయకుడు మహమ్మద్ రఫీ. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని నెల్లూరులోని మహమ్మద్ రఫీ కల్చరల్ అకాడమీ నిర్వాహకులు మ్యూజికల్ నైట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్చరల్ అకాడమీ నిర్వాహకులు జాకీర్‌హుస్సేన్ పర్యవేక్షణలో ఈ గానకచేరీ ఆద్యంతం అద్భుతంగా సాగి, శ్రోతలను బాగా అలరించింది. ఈ కార్యక్రమంలో భాగంగా మహమ్మద్ రఫీ గానం చేసిన ఎన్నో హిందీ పాటలతో పాటు, తెలుగుచిత్రాల్లోనూ ఆయన మృదుమధురంగా గానం చేసిన 'నా మది నిన్ను పిలిచింది గానమై'..' సిపాయీ..ఓ సిపాయీ', ఇద్దరి మనసులు ఒకటాయే.. వంటి పాటలను గాయనీ గాయకులు హృద్యంగా గానం చేసి శ్రోతలను ఉర్రూతలూగించారు.

ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయకులు అబ్దుల్ కలీమ్ (కడప), హేమంత్ (హైదరాబాద్)లతో పాటు స్థానిక గాయనీగాయకులు జీలు, గౌస్‌బాషా, ఎం.డి అస్లాం, సిమ్రాన్, ఇబ్రహీం, సుజాత, శిరీష, గీత తదితరులు పాల్గొని మహమ్మద్ రఫీ గానం చేసిన మధురగీతాలను ఆలపించి అందరినీ ఆకట్టుకున్నారు. స్థానిక మైనార్టీ నాయకులు షేక్ మున్వర్‌బాషా, సయ్యద్ షమీ, షేక్ కాలేషా, జాఫర్ షరీఫ్, అసీఫ్‌పాషా తదితరులు పాల్గొని కల్చరల్ అకాడమీ వారు చేస్తున్న కార్యక్రమాలను, గాయనీగాయకులను అభినందించారు. తొలుత ప్రముఖ ఇంద్రజాల ప్రదర్శకులు జాదూగర్ శీను ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఇంద్రజాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

# కనులపండువగా కలియుగ దైవం కల్యాణం

నెల్లూరు దర్గామిట్టలోని టిటిడి కల్యాణ మండపంలో ఈనెల 10న శ్రీ వెంకటేశ్వర స్వామి జన్మ నక్షత్రమైన శ్రవణానక్షత్రానికి శ్రావణ పూర్ణిమ తోడవడం, రక్షాబంధన్ పర్వదినం కావడంతో శ్రీదేవి,భూదేవిలతో శ్రీనివాసుని కల్యాణ మహోత్సవాన్ని హిందూ ధర్మప్రచార పరిషత్, టిటిడి సంయుక్తంగా వైభవోపేతంగా నిర్వహించాయి. శ్రీవారి పాదాల వద్ద వుంచిన కంకణాలను వేలాది మంది భక్తులకు అందించారు. హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లా కో-ఆర్డినేటర్ మల్లెల శ్రీహరి, ప్రోగ్రాం అసిస్టెంట్ జి.హరనాథ్, అధ్యక్షులు సీవీ సుబ్రహ్మణ్యం, కార్యదర్శి వంజవాక ధనుంజయ, ఉపాధ్యక్షుడు కొండా శేఖర్‌రెడ్డి, సభ్యులు వాకాటి విజయకుమార్‌రెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, వీరిశెట్టి సుధాకర్, కొండెపి గిరిజ, వేమిరెడ్డి సనత్‌కుమార్‌రెడ్డి, పెంద్యాల సూర్యనారాయణ, టిటిడి పండితులు దేవరాజు, చెంచులక్ష్మి పాల్గొన్నారు.

# వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు



వరలక్ష్మీవ్రతం పర్వ దినం సందర్భంగా ఈ నెల 8న నగరంలోని అమ్మవారి ఆలయాల్లో ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీదేవికి పూజలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా భక్తుల రద్దీతో ఆలయాలు క్రిక్కిరిసిపోయాయి. పెద్దసంఖ్యలో మహిళలు ఆలయాలకు విచ్చేసి వరలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు, వ్రతాలు నిర్వహించుకున్నారు. నగరంలోని దర్గామిట్టలో వున్న శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయం ఉదయం నుంచి రాత్రి దాకా భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ప్రత్యేక వేదికపై విశేషాలంకారంతో, శోభాయమానంగా కొలువుదీరిన అమ్మవారిని భక్తులంతా దర్శించుకున్నారు. శ్రీరాజరాజేశ్వరిదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు రత్నం జయరామ్, ఇ.ఓ పి. నాగేశ్వరరావు, ప్రధాన అర్చకులు తంగిరాల రాధాకృష్ణశర్మ తదితరుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి.

అదేవిధంగా, స్థానిక మూలాపేటలోని శ్రీ మూలస్థానేశ్వరస్వామి ఆలయంలోను, ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలోనూ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# పండ్ల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలి

## - - వ్యాపారుల సంక్షేమసంఘం - -

నెల్లూరులో శాశ్వత ప్రాతిపదికపై పండ్ల మార్కెట్‌ను ఏర్పాటు చేయకపోవడంతో ఎంతోకాలంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, నెల్లూరుకు నగరస్థాయి హోదా వచ్చినప్పటికీ, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా శాశ్వత ప్రాతిపదికపై ఒక పండ్ల మార్కెట్ కూడా లేకపోవడం విచారకరమని నగర జనరల్, పండ్ల వ్యాపారుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు వి.సుబ్రహ్మణ్యం, కార్యదర్శి ఎం.డి రఫీ అహమ్మద్‌లు పేర్కొన్నారు. ఈ నెల 11న వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, నగరంలో నిత్యం లక్షలాది రూపాయల మేరకు పండ్ల వ్యాపారం జరుగుతున్నా పండ్ల వ్యాపారుల కోసం ఒక ప్రత్యేక ప్రాంతాన్ని కేటాయించడమో, లేదా పండ్ల విక్రయానికి షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటుచేయడమో జరగలేదని, దీంతో చిన్నబజారు ప్రాంతంలో సన్నని ఇరుకు వీధుల్లో హోల్‌సేల్ పండ్ల వ్యాపారం జరుగుతుండడం వల్ల ఆ ప్రాంతాలు రద్దీగా మారుతున్నాయని వారు పేర్కొన్నారు. ఇకనైనా అధికారులు ఈ పరిస్థితులను పరిశీలించి నగరంలో పండ్లమార్కెట్ ఏర్పాటుకు కృషి చేయాలని వారు కోరారు.

## విద్యార్థులకు...

# పలకలు, పుస్తకాల పంపిణీ



నెల్లూరు జిల్లా ముస్లీం యూత్ సేవా కమిటీ ఆధ్వర్యంలో షవ్వాల్ నెల సందర్భంగా జెండావీధి ట్యాంకు ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, పలకలు ఉచితంగా పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ముస్లీం యూత్ అధ్యక్షులు ఎస్.కె.ఖాలీద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారికి వీలైనంతలో సహాయం చేయాలని పేద విద్యార్థులను, పేద ప్రజలను ఆదుకోవాలని ఇటువంటి సేవా కార్యక్రమాలను ముస్లీం యూత్ సేవా కమిటీ ఎల్లప్పుడు చేస్తూ వుంటుందని దీనికి వీలైనంత వరకు అందరూ చేయూత నివ్వాలని పేర్కొన్నారు.

కార్యక్రమంలో 43వ డివిజన్ కార్పొరేటర్ ఎమ్.డి.ఖలీల్, నెల్లూరు జిల్లా జూనియర్ ఎన్.టి.ఆర్.ఫ్యాన్స్ అధ్యక్షులు ఎన్.ఆర్.ఆలీ, గోల్డ్‌స్మిత్ ఎజాజ్, కె.జి.ఎన్. ఫ్రూట్స్ మున్నా, మాషా అల్లా కాయ్టరింగ్ ఇస్సాక్, మైను, ఉపాధ్యక్షుడు అల్తాఫ్, ఇమ్రాన్, బాబులు, కరీం, బషీర్, సోయల్, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ వైభవం...!



తిరుపతికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త పేరం హరిబాబు - దేవిల కుమార్తె గ్రీష్మ - ఉదయ్‌తేజ (ఉదయి ఇంటర్నేషనల్, తిరుపతి అధినేత బత్తల గిరిబాబు - వసంతల కుమారుడు)ల పరిణయం ఈ నెల 13వ తేదీ తిరుపతిలోని రామానాయుడు కల్యాణ మండపం నందు ఘనంగా జరిగింది. నవదంపతులకు 'లాయర్' శుభదీవెనలు



నెల్లూరు వాస్తవ్యులు ఆలూరు శివకుమార్‌రెడ్డి - శైలజల కుమారుడు మనోజ్‌కుమార్ - శృతి (హైదరాబాద్ వాస్తవ్యులు మెట్టు సదాశివకుమార్‌రెడ్డి - కామాక్షిల కుమార్తె)ల కల్యాణం ఈ నెల 14వ తేదీ నెల్లూరులోని కె.జి.కె. కల్యాణ మండపంలో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



నెల్లూరు సహాయవాణిజ్యపన్నుల అధికారి (ఇంటలిజెన్స్) పెరుగు రామకృష్ణ - ప్రముఖ రచయిత్రి సుజనల కుమార్తె శ్రీనిధి - దిలీప్‌కుమార్(నాయుడుపేట వాస్తవ్యులు అమరావతి రామయ్య - మంగమ్మల కుమారుడు)ల వివాహం ఈ నెల 10వ తేదీన అచ్యుత సుబ్రహ్మణ్యం కల్యాణ మండపంలో ఘనంగా జరిగింది. కొత్తజంటకు 'లాయర్' శుభాభినందనలు.

# పదవి నిలుస్తుందా?

(మొదటిపేజీ తరువాయి)

తెలుగుదేశంలో చేరిన 12మంది కార్పొరేటర్లు మేయర్ ఎన్నికకు ముందు తెలుగుదేశంలోకి పోవడానికి సిద్ధపడ్డవాళ్లే. కాని ఇప్పుడు అనిల్, కోటంరెడ్డిలు వారిని గట్టిగా కట్టడిచేసారు. ముస్లింకు తాము వెన్నుపోటు పొడిచామనే అపకీర్తి రాకూడదని ఇష్టం లేకున్నా అజీజ్‌ను మేయర్‌ను చేసారు. కాని మేయర్‌గా ఒక నెల కూడా పదవీకాలం పూర్తి కాకముందే అజీజ్ తెలుగుదేశం నాయకులతో ముందస్తు చేసుకున్న ఒప్పందంతో ఆ పార్టీలో చేరిపోయారు. జగన్ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వంచించాడు.

అజీజ్‌తో పాటు తెలుగుదేశంలో చేరిన 12మంది కార్పొరేటర్లపై ఫిరాయింపు నిరోధక చట్టం క్రింద వేటు వేయించాలని వైకాపా ఎమ్మెల్యేలు గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే పార్టీ విప్‌ను ధిక్కరించినందుకు ప్రకాశం జిల్లా జడ్పీ ఛైర్మెన్ ఈదర హరిబాబుపై సస్పెండ్ వేటు వేశారు. కావలి మున్సిపల్ ఛైర్‌పర్సన్ వ్యవహారంలోనూ వేటు పడింది. ఈ నేపథ్యంలోనే ఎన్నికల కమీషన్ ద్వారా అజీజ్‌పై వేటు వేయించాలని, కాకపోతే న్యాయపోరాటం చేసైనా పార్టీని, మైనార్టీలను మోసం చేసిన అజీజ్‌కు తగిన బుద్ధి చెప్పాలని వీళ్లు పట్టుదలగా వున్నారు.

# విద్యార్థులను ప్రోత్సహిస్తున్న పారిశ్రామికవేత్తలు



నెల్లూరు జిల్లా సంచాలకుల కార్యాలయంలోని వీడియోకాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఈనెల 11న జరిగిన సమావేశంలో పదో తరగతి ఫలితాలలో ప్రతిభ కనబరచిన పేద విద్యార్థులను కార్పొరేట్ కళాశాలల్లో చేర్పించి ఉన్నత చదువులకు సహాయం అందించి ప్రోత్సహిస్తున్న పారిశ్రామికవేత్త లకు జిల్లా సంయుక్త సంచాలకులు జి.రేఖారాణి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సరస్వతి నిధితో పాటు పారిశ్రామిక వేత్తలు అందిస్తున్న సహకారంతో మిగిలిన ప్రతిభ కలిగిన పేదవిద్యార్థులకు కూడా కార్పొరేట్ కళాశాలల్లో విద్య అందుబాటులో కొచ్చిందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు వారి చదువులో ఎలాంటి అవాంతరాలు కలగకుండా వారిని చదివించాలని, అలాగే విద్యార్థులు పారిశ్రామికవేత్తల ప్రోత్సాహంతో బాగా చదివి ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. జిల్లా అదనపు సంయుక్త సంచాలకులు ఆర్.ఎస్.రాజ్ కుమార్ మాట్లాడుతూ చదువులో రాణిస్తున్న 60 మంది పేద విద్యార్థులను కార్పొరేట్ కళాశాలల్లో చేర్పించి చదివించేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు రావడం హర్షించదగ్గ విషయమన్నారు.

ఏపిజెన్‌కో పవర్‌ప్రాజెక్ట్ వారు 8మంది కృష్ణపట్నం పోర్టు కంపెనీ లిమిటెడ్ 8 మంది మీనాక్షి పవర్ ప్రాజెక్ట్ వారు 9మంది శ్రీసిటీ వారు 9మంది ఎన్‌సిసి పవర్ ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ వారు 9మంది విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుకునేలా ఆర్థిక సహాయం అందిస్తున్నారని తెలిపారు. సమావేశంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, పారిశ్రామిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అసామాన్య నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

గెలిపించిన ప్రజల సంక్షేమానికే వెచ్చిస్తా మని ప్రకటించి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన ఉదారస్వభావాన్ని, ప్రజల పట్ల కృతజ్ఞతా భావాన్ని చాటుకున్నారు. తనకు డబ్బు ముఖ్యం కాదనీ, ప్రజల ఆశీస్సులే ముఖ్య మని అంటూ, కేవలం ఉత్తుత్తి మాటలు చెప్పడం కాదు, ఈ అయిదేళ్ళలో సుమారు 60 లక్షల రూపాయల దాకా వచ్చే తన జీతభత్యాల డబ్బులో ఒక్క రూపాయి కూడా తనకోసం వినియోగించుకోకుండా, ఆ డబ్బునంతా ప్రజాసేవకు వెచ్చిస్తానని ప్రకటించి అందరి ప్రశంసలూ అందుకున్నారు. తన జీతభత్యాల డబ్బులో 55 లక్షల రూపాయలను ప్రజాసేవకు వినియో గిస్తానని ప్రకటించారు. అంతేకాదు, పార్టీ పరంగా, పార్టీకి తనవంతు సహకారం అందిస్తూ మిగిలిన మరో 5 లక్షల రూపాయలను హైదరాబాద్‌లోని వైఎస్సార్సీపి కార్యాలయ నిర్వహణకు ఖర్చుచేస్తామని చెప్పారు. వాస్తవానికి శ్రీధర్‌రెడ్డి కోటీశ్వరుడేమీ కాదు. మధ్య తరగతి కుటుంబంలో జన్మించారాయన. ఎంతో కష్టపడి, ప్రజల ఆశీస్సులతో, ఎన్నో అవాంతరాలు, ఆటుపోట్లు ఎదుర్కొని నియోజకవర్గ ప్రజల దీవెనలతో తాను ఎమ్మెల్యే అయ్యారన్నది అందరికీ తెలిసిన విషయమే. ముక్కుసూటి మనిషి.. ఏదేమైనా సరే నిక్కచ్చిగా మాట్లాడడం ఆయన నైజం. అయితే, ఆయన మాటలు కటువుగా అనిపించినా ఉదారమైన సున్నిత మనస్తత్వం, మంచి వ్యక్తిత్వం వున్నవారు కావడం ఆ నియోజకవర్గ ప్రజల అదృష్టమనే చెప్పాలి. ప్రజల అభ్యున్నతే తన లక్ష్యమని, మంచి ఎమ్మెల్యేగా ప్రజలందరి దీవెనలందుకోవ డమే తన జీవితాశయమని భావించేవారు నేటి కాలంలో ఎందరుంటారు?... ఒక నాయకునిగా ప్రజాసేవా కార్యక్రమాల నిర్వహణతో పాటు, వ్యక్తిగా.. తనవంతుగా పేదప్రజలకు, నిరుపేద విద్యార్థులకు శక్తిమేరా సాయం చేయాలనుకునేవారు మరెందరుంటారు?..

ఇటీవల నియోజకవర్గంలో చదువులో బాగా రాణిస్తున్న నిరుపేద విద్యార్థులకు శ్రీధర్‌రెడ్డి తనవంతు సాయం అందజేశారు. పలువురు విద్యార్థులకు రూ.10వేల వంతున ప్రతిభా అవార్డులతో పాటు నగదు బహుమతులచ్చి, ఆ విద్యార్థులు ఉన్నతంగా రాణించేందుకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. తన మిత్రులు, సేవాభిలాషులతో కలసి మరింతగా పేదలకు సేవచేసేందుకు అనువైన మంచి మార్గాలను అన్వేషిస్తున్నారు. అదేవిధంగా, నగరంలోని వాత్సల్య అనాధశరణాలయంలోని చిన్నారుల అభ్యున్నతి కోసం, వారి అవసరాల కోసం రూ. 2లక్షలు కేటాయించారు. పేద విద్యార్థులు, బాధితులకు తనవంతు సాయంగా తన వేతనాన్ని వెచ్చించడం తనకెంతో సంతోషకరమని, ఇలా అందరికీ సేవ చేయడంలోనే ఎంతో సంతృప్తి వుంటుందనంటూ, తన మంచి మనసును చాటుకుంటున్నారు.

మంచి ఎమ్మెల్యేగా వుంటూ ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకోవడమే తన జీవితాశయమని, అంతకన్నా తనకు కావాల్సిందేమీ లేదని భావించే కోటం రెడ్డికి, అన్నిటికీ మించి ఆయన ఔదార్యానికి ఈ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా 'లాయర్' శుభాభినందనలు.

# పెరుగుతున్న దూరం

(మొదటిపేజీ తరువాయి)

ఉంటారో, లేక మంత్రి నారాయణ వైపు ఉంటారో తేల్చుకోండంటూ ఆప్షన్ ఇస్తున్నట్లు సమాచారం. ఇప్పుడు అధికార కేంద్రం నారాయణ చేతిలో ఉంది కాబట్టి పెద్ద, చిన్న నాయకులెక్కువ మంది నారాయణ దగ్గరకే పోతున్నారు. ఇటీవల ఎమ్మెల్సీగా నారాయణ నామినేషన్ వేసేరోజే నెల్లూరులో సోమిరెడ్డి, తన సొంత కార్యాలయాన్ని ప్రారంభించు కోవడం వర్గవిభేదాలకు ఆజ్యం పోసింది. నెల్లూరులో తమకు పోటీగా సోమిరెడ్డి ఆఫీసు పెట్టాడని, రేపు 24వ తేదీ చంద్రబాబు వస్తున్నాడని, ఆరోజే సోమిరెడ్డి ఆఫీసును మూయిస్తామని నారాయణ వర్గం అంటుంటే, 1991 నుండి తనకు నెల్లూరులో ఆఫీసు ఉందని, ఈరోజు కొత్తగా పెట్టిందేమీలేదని, దీనిని మూయించే సత్తా ఎవరికీ లేదని సోమిరెడ్డి వర్గం ధీమాగా ఉంది. తన నియోజకవర్గ పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉండడానికే తన కార్యాలయం పెట్టానని సోమిరెడ్డి చెబుతున్నాడు.

నారాయణ రాజకీయనాయకుడు కాదు, ఆయనకు ప్రత్యేకంగా జిల్లాలో ఒక వర్గం అవసరం లేదు. అలాగే సోమిరెడ్డికి నారాయణ రాజకీయ విరోధి కాదు. ఈయనకు రావాల్సిన మంత్రి పదవిని ఆయన ఎగరేసుకుపోయిందేమీ లేదు. ఒకవేళ మొన్న ఎన్నికల్లో సోమిరెడ్డి గెలిచివున్నా ముందుగా మంత్రి పదవి నారాయణకే వచ్చేది. దీనిని ఎవరూ కాదనలేరు. వీళ్ల రాజకీయ వైరం పదవుల వద్దో, పార్టీ టిక్కెట్ల వద్దో కాదు... కేవలం జిల్లాలో ఆధిపత్యం మీదే! వర్గ రాజకీయాల గురించి కూడా నారాయణ పెద్దగా ఆలోచించడు. కేవలం మధ్యలో కొందరు సృష్టిస్తున్న అపోహలు, అనుమానాలతోనే ఇద్దరూ వైరాన్ని పెంచుకుని దూరమవుతున్నారు.



# గూడూరు డివిజన్ వార్తలు

## ప్రజలకు న్యాయం చేయండి



ఆర్డీవో శ్రీనివాసరావుతో చర్చిస్తున్న మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్, ప్రక్కన తెలుగు దేశం పార్టీ నాయకుడు చదలవాడ హరిప్రసాద్‌నాయుడు.

పట్టణంలో నెలకొన్న సమస్యలపై స్పందిస్తే ప్రజలకు న్యాయం జరుగుతుందని గూడూరు మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్ కోరారు. గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆర్డీవో కె.శ్రీనివాసరావును కలసి పలు సమస్యలను వివరించారు. ముఠా వర్కర్స్ యూనియన్ వారికి గతంలో గాంధీనగర్ ప్రాంతంలో 110మందికి ఇళ్ళస్థలాలు మంజూరు చేశారన్నారు. వాటికి హద్దులు చూపించక పోవడంతో నేటికి అక్కడ ఇళ్ళు నిర్మించుకొనే అవకాశం లేకుండాపోయిందన్నారు. అలాగే మూడో విడత పక్కా ఇళ్ళ మంజూరులో కేవలం కొద్ది మందికి మాత్రమే లబ్ధిచేకూరిందన్నారు. మిగిలిన పేదలు అద్దె ఇళ్ళలో కాలం వెళ్ళదీస్తూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారన్నారు. గతంలో సబ్‌కలెక్టర్ నివాస్ పూర్తిస్థాయి విచారణ చేపట్టి నివేదికలు సిద్ధంచేశారన్నారు. అయినప్పటికి ఎలాంటి ప్రయోజనంలేదని వివరించారు. దీనికి ఆర్డీవో బదులిస్తూ లే ఔట్ డీటీపీ అనుమతులు నిమిత్తం పంపి ఉన్నాయన్నారు. అక్కడి నుంచి అనుమతులు రాగానే చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చదలవాడ హరిప్రసాద్‌నాయుడు, గోనుశివకుమార్, శ్రీహరి, ఉదయ కుమార్, రవి, వెంకటేశ్వర్లు, నరసింహనాయుడు, మైనంపాటి మోహన్ పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు ఆధార్‌కార్డు తీసుకోవాలి

### ఆర్డీవో శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసరావు

భవిష్యత్తులో ప్రతి సంక్షేమ పథకానికి ఆధార్ కార్డులు అనుసంధానం చేస్తారని కుటుంబంలోని ప్రతి ఒక్కరూ ఆధార్‌కార్డు తీసుకొనేలా అధికారులు సంయుక్తంగా పర్యవేక్షించాలని ఆర్డీవో కె.శ్రీనివాసరావు తెలిపారు. గూడూరు ఎంపిడివో కార్యా లయంలోని సమావేశ మందిరంలో సోమవారం పురపాలక ఎంపిడీవో తహశీల్దార్ల కార్యాలయాల అధికారులతో ఆధార్‌కార్డుల ఆవశ్యకతపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రస్తుతం రేషన్‌కార్డులు, ఉపకారవేతనాలు, రుణామాఫీ వర్తింపు పింఛన్లు, ఇళ్ళస్థలాలు మంజూరు, బ్యాంకు ఖాతాలు, తదితరాలకు ఆధారే కీలకమని వీటిని ఆధార్ కేంద్రాల్లో తీయించుకొని ప్రతి ఒక్కరికి వివరించి వారు పొందేలా చూడాలని ఆదేశించారు. సర్వే బృందాలు ప్రతి ఇంటికి వెళ్ళి ఆధార్ కార్డులేని వారిని గుర్తించి ఈనెలాఖరులోగా ఎన్‌రోల్‌మెంట్ చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గూడూరులో 100శాతం నమోదుచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ అనురాధ, ఎంపిడీవో నిర్మలాదేవి, తహశీల్దార్ వెంకటేశ్వర్లురెడ్డి, పురపాలకసంఘ అధికారులు, వీఆర్వోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ స్కూల్స్ నూతన కార్యవర్గం ఎంపిక



గూడూరు నియోజకవర్గ ప్రైవేటు అనైడెడ్ స్కూల్స్ మేనేజ్ మెంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం రోటరీ భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సుబ్బారెడ్డి, నెల్లూరు జిల్లా అధ్యక్షులు బి.మనోహర్‌రెడ్డి, నెల్లూరుజిల్లా ఉపాధ్యక్షులు బి.శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ట్రెజర్ మల్లికార్జునరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు సి.మనోహర్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గూడూరు నియోజకవర్గానికి ప్రైవేటు స్కూల్స్ గౌరవాధ్యక్షులుగా బి.దశరథరామిరెడ్డి అధ్యక్షులుగా కె.చంద్రమోహన్, కార్యదర్శిగా ఎన్.సంజీవరాజు, కోశాధికారిగా ఎం.మహేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎన్.సురేంద్రరెడ్డి, జాయింట్ సెక్రటరీగా పి.కిషోర్, సభ్యులుగా వై.సుమంత్, కె.శ్రీనివాసమూర్తి, యు.వెంకటేశ్వర్లు, ఉష, ఐ.కమలాకర్, కె.ఆర్.రెడ్డి, ఎన్నికైనారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ స్కూల్స్ గూడూరు నియోజకవర్గ కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

## చోరీల నివారణకు ప్రజల సహకారం అవసరం - సిఐ భూషణం



సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ సిఐ భూషణం, ప్రక్కన ఎస్సై బాబి

పట్టణంలో చోరీల నివారణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని గూడూరు పట్టణ సిఐ భూషణం తెలిపారు. స్థానిక సిఐ కార్యాలయంలో శుక్రవారం పట్టణంలోని ఆలయాల నిర్వాహకులు ఎండో మెంట్ సిబ్బందితో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ సెంథిల్‌కుమార్, డీఎస్పీ కె.చౌడేశ్వరి ఆదేశాలతో ఆలయాల్లో చోరీలను నివారిం చేందుకు ప్రత్యేక చర్యలను చేపడుతున్నట్లు తెలిపారు. పట్టణంలో 30కి పైగా ఆలయాలున్నాయని వాటిలో 6 ఆలయాలు ఎండోమెంట్‌కు సంబంధించినవన్నారు. ప్రతి ఆలయంలో పాయింట్ బుక్ ఏర్పాటుచేస్తామని కాపలా ఉండే వాచ్‌మెన్‌లు ప్రతి రోజు అందులో సంతకం చేయాలన్నారు. వాచ్‌మెన్‌లు లేని ఆలయాల్లో కాపలా దారులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజు అలంకరించే వస్తువులను ఆలయంలో ఉంచి మిగిలిన విలువైన ఆభరణాలను లాకర్‌లలో ఉంచి ప్రత్యేక పూజలు జరిగే దినాల్లో అభరణాలను అంలకరించేలా చూడాలన్నారు. పట్టణంలో వ్యభిచారం, సింగిల్ నెంబర్ లాటరీలను నిర్వహించే వారిపై నాన్‌బెయిలబుల్ కేసులను నమోదు చేయడంతో పాటు వ్యభిచారం చేసే ఇళ్లను సీజ్ చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఒకటో పట్టణ ఎస్సై బాబీ, ఆలయాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఘనంగా వరలక్ష్మీవ్రతం పూజలు



ముత్యాలమ్మ ఆలయంలో వరలక్ష్మీవ్రతంలో పాల్గొన్న మహిళలు

గూడూరు పట్టణంలోని పలు అమ్మ వారి ఆలయాలు శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని భక్తులతో కిటకిట లాడాయి. వేకువజామునే మహిళలు ఇళ్లల్లో ప్రత్యేకపూజలు చేసి ముతైదువులకు పసుపు, కుంకుమలను అందజేసారు. అనంతరం వరలక్ష్మీవ్రతాన్ని ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవార్లకు పూజలు చేసి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కాగా చిల్లకూరు మండలంలోని తూర్పు కనుపూరులో ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రత పూజలు నిర్వహించారు. మనగుడి కార్యక్రమంలో భాగంగా ఆలయ కమిటీసభ్యులు వరలక్ష్మీవ్రతాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లుచేపట్టారు. చుట్టుప్రక్కల గ్రామాల నుంచి వరలక్ష్మీవ్రతానికి 108మంది దంపతులు హాజరయ్యారు. ఆలయ కమిటీ ఛైర్మెన్ వరిదిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ఈఓ తాతా శ్రీనివాసరావు పర్యవేక్షణలో అర్చకుడు శివప్రసాద్ ఆధ్వర్యంలో మహిళలు వరలక్ష్మీవ్రతపూజను నిర్వహించారు. తమిళనాడులోని గుమ్మిడిపూండికి చెందిన కృష్ణన్ అనే భక్తుడు వ్రతంలో పాల్గొన్న మహిళలకు చీర, రవిక అందజేశారు. ఆలయకమిటీ సభ్యుడు చిట్టేటి నారాయణ వ్రతంలో దంపతులకు వెండికాసును అంద జేశారు. ఆలయ సిబ్బంది సురేంద్ర పాల్గొన్నారు.

### గూడూరు టూటౌన్ డిస్కం ఏఈ

## ప్రసాద్ మృతికి సంతాపం



గూడూరు రెండో పట్టణ ఏఈ అక్కిలి గుంట ప్రసాద్ మృతికి పలువురు తమ సంతాపాన్ని వ్యక్తం చేసారు. చిల్లకూరు మండలం రైటర్ సత్రం వద్ద శుక్రవారం రాత్రి కారు అదుపుతప్పి లారీని ఢీకొన్న సంఘటనలో ఏఈ తీవ్రంగా గాయపడి మృతి చెందాడు ఆయన మృతదేహానికి శనివారం పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాలలో పరీక్షలు నిర్వహించారు. తరువాత మృతదేహాన్ని కోటలో సందర్శనార్థం ఉంచారు. ఆయనకు అధికారులు, ఉద్యోగులు నివాళులర్పించాక సొంత గ్రామమైన ఓజిలికి తీసుకెళ్లారు. డిస్కం డీఈ ఇస్మాయిల్, ఏడీ శ్రీధర్‌రెడ్డి, పలువురు ఏఈలు సిబ్బంది పాల్గొని ప్రసాద్ కుటుంబీకులకు తమ ప్రగాఢసానుభూతిని తెలిపారు.



# శ్రీకాళహస్తి న్యూస్

## పర్యాటక, పరిశ్రమల అభివృద్ధికై చర్యలు

### జిల్లా కలెక్టర్ సిద్ధార్థ జైన్

చిత్తూరు జిల్లాలో పర్యాటక రంగం, పరిశ్రమల రంగాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టరు సిద్దార్ధ జైన్ పేర్కొన్నారు. సోమవారం శ్రీకాళహస్తి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతి పుణ్యక్షేత్రానికి నెలకు సరాసరి 22లక్షల మంది, శ్రీకాళహస్తికి 6 నుంచి 8లక్షలమంది భక్తులు వస్తుంటారని అన్నారు. తిరుపతికి వచ్చే భక్తులు శ్రీకాళహస్తీశ్వరాలయానికి మళ్ళించగలిగితే ఇక్కడ ఈ ప్రాంతానికి రాబడి పెరిగి అభివృద్ధి జరిగే అవకాశముందన్నారు. ఇందుకుగాను పర్యాటకశాఖ దశలవారీగా చర్యలను చేపట్టాలన్నారు. రైతులందరూ పట్టాదారు పాసుపుస్తకాలకై మీ సేవ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతేకాని తమ దరఖాస్తులను రెవెన్యూ కార్యాలయం నందు అందచేయరాదని అన్నారు. చుట్టుప్రక్కల ఉన్న గిరిజన సోదరులకు ఇళ్ళపట్టాలు, రేషన్‌కార్డులు, బోర్లు తదితర మౌళిక వసతులకై జిల్లా అటవీ శాఖాధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి ఇద్దరు సమన్వయ పరచుకొని తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఐటిడిఎ, డ్వామా అధికారులు అనుసంధానం చేసుకోవాలన్నారు. తొట్టంబేడు జూనియర్ మహిళా కాలేజీ స్థలం ఆక్రమణకు గురవుతుందని విద్యార్థులు ఫిర్యాదు చేశారని ఇందుకుగాను సంబంధిత ప్రిన్సిపల్ ను రికార్డ్సను తీసుకొని రావాలని ఆదేశించామన్నారు. తెలుగుగంగ కాలువకు కావాల్సిన భూసేకరణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. ఇందుకుగాను నిర్దేశించిన సమయంలో పనులను పూర్తి చేయాలన్నారు. శ్రీకాళహస్తి, తిరుపతి రూరల్ మండలాల నందు అనర్హులకు ఇళ్ళ పట్టాలు ఇచ్చారని ఆరోపణలు వచ్చాయన్నారు. తొట్టంబేడులో ప్రభుత్వ భూములు ఉన్నాయని ఇంటిగ్రేటెడ్ ప్లానింగ్ ద్వారా పరిశ్రమలు ఏర్పాటు చేయగలిగితే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని తద్వారా ఉపాధి అవకాశాలు రావడమే కాకుండా రాబడి కూడా పెరుగుతుందన్నారు. దీనికై చక్కటి ప్రతిపాదనలు రూపొందించుటకు గాను తుడ ఉపాధ్యక్షులు, ఆర్.డి.ఓ., తిరుపతి, శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్లతో ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. పెన్షన్లు మధ్యలో ఆగిపోయాయని పెన్షన్లు మంజూరు చేయాలని అభ్యర్ధనలు వస్తున్నాయని దీనికై జిల్లాలో ఒక డేటాను సేకరిస్తామన్నారు.

గ్రామస్థాయిలో, మండలస్థాయిలో పరిష్కరించాల్సిన పనులను ప్రజలు "ప్రజావాణి" కార్యక్రమానికి దరఖాస్తులు చేస్తున్నారని ఇలా ఎందుకు జరుగుతుందని, ఆ స్థాయి సమస్యలు అక్కడే ఎందుకు పరిష్కారం కావడం లేదని వి.ఆర్.ఓలతో ఈ విషయమై చర్చిస్తామన్నారు. వారి పరిధిలో తీర్చగలిగిన ప్రజల సమస్యలను తప్పక పరిష్కరించాలన్నారు. రాబోయే రోజుల్లో సంక్షేమ హాస్టళ్ళ అభివృద్ధికై రూపాంతరం– 2 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికై అదనపు నిధులను ప్రభుత్వం నుంచి కోరనున్నామన్నారు. సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థులు బాగా చదువుకోవాలనే ఉద్దేశ్యంతో వారి శ్రేయస్సుకై చర్యలు తీసుకుంటామన్నారు.

రెవెన్యూ విభాగ పనితీరుపై గతంలో "ఫేస్ బుక్" నందు ప్రజల నుంచి సలహాలు కోరామని ప్రజలు స్పందించి " బయోమెట్రిక్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని, ఒకే చోట ఎక్కువ కాలం పనిచేస్తున్న వారిని మార్చాలని, కార్యాలయాల్లో సి.సి. కెమెరాలు ఏర్పాటు చేయాలని సలహాలు ఇచ్చారని తెలిపారు. అదే విధంగా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికై టెంపుల్ టూరిజంను ప్రోత్సహించడానికి గాను జిల్లాలో ఉన్న మంచి టూరిజం సైట్స్‌ను ఫేస్ బుక్ నందు పంపాలన్నారు.

yourcollectorchittoor@gmail. com మెయిల్‌కు నిర్భయంగా తగిన సలహాలు, సూచనలను ఇవ్వాలని ప్రజలను కోరారు. కె.వి.బి.పురంలో బోగస్ పట్టాల ద్వారా రుణాలను పొందిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకు గాను విచారణ జరిపి ఐదు రోజులలోపు నివేదికను అందచేయాలని తిరుపతి ఆర్.డి.ఓను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డీవో సి.హెచ్. రంగయ్య, మున్సిపల్ కమిషనర్ శ్రీలక్ష్మి, సహాయ సంచాలకులు మణిరామ్, డి.పి.ఆర్.ఓ. లీలావతి, డివిజినల్ పి.ఆర్.ఓ. వేణుగోపాల్‌రెడ్డి , తహశీల్దార్ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# అభినయ్ - తన్మయిల కల్యాణ వైభవం



చెన్నైలోని తెలుగువారు ఏ తెలుగు వేడుక చేసుకున్నా ముందుగా గుర్తొచ్చే వ్యక్తి కాకుటూరు అనిల్‌కుమార్‌రెడ్డి. నిత్యం తన వ్యాపార వ్యాపకంతో బిజీగా వున్నా తన సమయంలో కొంత తెలుగువారి కోసం, తెలుగు వెలుగు కోసం కేటాయించి శ్రమించే "అనిల్‌రెడ్డి" అంటే తమిళనాట తెలియని తెలుగువారు బహుశా బహుఅరుదేమో...!

అనిల్‌కుమార్‌రెడ్డి, మాధవి దంపతుల ఏకైక కుమారుడు అభినయ్ వివాహం ఒంగోలుకు చెందిన వై.వి.భద్రారెడ్డి - రాధికల ఏకైక కుమార్తె తన్మయితో ఆగష్టు 9వ తేదీ రాత్రి నెల్లూరు వి.పి.ఆర్. కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది.

డా॥ వై.యస్.రాజశేఖరరెడ్డికి తోడల్లుడిగా, జగన్‌కి బాబాయిగా వై.యస్.ఆర్ కాంగ్రెస్‌పార్టీలో కీలకవ్యక్తిగానే కాకుండా ప్రస్తుతం ఒంగోలు ఎంపిగా వున్న వై.వి. సుబ్బారెడ్డికి భద్రారెడ్డి సొంత తమ్ముడు. సుబ్బారెడ్డి, భద్రారెడ్డి, హనుమారెడ్డి సోదరుల ముగ్గురికీ ముద్దుల గారాల పట్టి తన్మయి కావడంతో ఓ వైపు పెదనాన్న మరోవైపు బాబాయి ఈ కల్యాణ వేడుకను చిరస్మరణీయ కానుకగా అభినయ్-తన్మయిలకు అందించారు. నెల్లూరులో వివాహానికి కొద్దిగంటల ముందు జరిగిన రిసెప్షన్ కార్యక్రమంలో వై.యస్. విజయమ్మ, వై.యస్.జగన్మోహన్ రెడ్డిలతో పాటు వై.యస్. కుటుంబసభ్యులందరూ పాల్గొని వధూవరులను దీవించారు. ఈ వేడుకకు రాష్ట్రానికి చెందిన పలువురు రాజకీయ ప్రముఖులు, అధికార అనధికారముఖ్యులు, వేలసంఖ్యలో ఇరు కుటుంబాల ఆత్మీయులు హాజరై నవ దంపతులను ఆశీర్వదించారు.



వధూవరులతో అనిల్‌కుమార్‌రెడ్డి, మాధవి, భద్రారెడ్డి, రాధిక



అభినందనలు అందజేస్తున్న వై.యస్.జగన్మోహన్‌రెడ్డి



దీవెనలందిస్తున్న వై.యస్.విజయమ్మ

## రిసెప్షన్



ఆగస్టు13వ తేదీ బుధవారం రాత్రి చెన్నై అడయార్‌లోని లీలాప్యాలెస్ హోటల్లో అనిల్‌కుమార్‌రెడ్డి - మాధవి దంపతులు ఇచ్చిన రిసెప్షన్ విందులో తమిళనాడు గవర్నర్ కొణిజేటి రోశయ్యతో పాటు మాజీకేంద్రమంత్రి జి.కె.వాసన్‌లు అభినయ్ - తన్మయిలకి తమ ఆశీస్సులు అందించారు.

తమిళనాడులో వుండే తెలుగు ప్రముఖులంతా ఈ రిసెప్షన్ వేడుకకు హాజరై నూతన దంపతులను దీవించారు. అనిల్‌కుమార్‌రెడ్డి-మాధవిల కుటుంబసభ్యులతో పాటు వై.వి.సుబ్బారెడ్డి సోదరుల బంధువర్గం, ఇరు కుటుంబాల ఆత్మీయ మిత్రులందరూ ఈ రిసెప్షన్ వేడుకకు హాజరై అభినయ్-తన్మయిల జంటను అక్షింతలతో ఆశీర్వదించారు. నూతన వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.







నవదంపతులతో భద్రారెడ్డి, హనుమారెడ్డి, వై.వి.సుబ్బారెడ్డి, వీరి సోదరి శచీదేవి, వీరి మాతృమూర్తి పిచ్చమ్మ




Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com